ఆదివారం
20-10-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 119
పేజీలు : 6+8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

యుద్ధంలోకి నాటో రావొద్దు: ఒలాఫ్

బెర్లిన్: ఉక్రెయిన్‌కు సంపూర్ణ మద్దతును ప్రకటించిన జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్... యుద్ధంలో భాగస్వామ్యం కావద్దని నాటోకు హితవు పలికారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో కలిసి బెర్లిన్‌లో సంయుక్త విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యుద్ధంలో నాటో ప్రమేయంతో పరిస్థితి మరింత జటిలం కాగలదని హెచ్చరించారు. భారీ విపత్తు నివారణకుగాను యుద్ధంలో నాటో భాగస్వామ్యం తగదని నొక్కిచెప్పారు. ఉక్రెయిన్‌కు ఎల్లప్పుడు అండగా నిలుస్తామని, ఆ దేశం కావాలనుకునేంత వరకు తమ మద్దతు ఉంటుందని చెప్పారు. అట్లాంటిక్ వెంబడి పరిణామాలను నిశితంగా గమనిస్తున్నామని ఒలాఫ్ వెల్లడించారు.

అమరావతి 2.0

- ఐదేళ్ల తర్వాత మళ్లీ రాజధాని పనులు
- ఇదొక స్వయం సమృద్ధి ప్రాజెక్టు
- సంక్షేమ కార్యక్రమాలకు గని లాంటిది
- కర్నూలులో హైకోర్టు బెంచ్, ఆర్థిక రాజధానిగా విశాఖ
- సీఆర్‌డీఏ కార్యాలయ పనులు ప్రారంభించిన సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి : ఐదు సంవత్సరాల తర్వాత అమరావతి రాజధాని నిర్మాణ పనులు మళ్లీ పున: ప్రారంభమయ్యాయి. రాయపూడిలో రూ.160 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీఆర్‌డీఏ ఏడంతస్తుల భవనాల నిర్మాణ పనులను శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాజధాని నిర్మాణానికి రూ.లక్ష కోట్లు అవుతాయని, అంతడబ్బు తమవద్ద లేదంటూ గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో ఐదేళ్లపాటు కాలయాపన చేశారని తెలిపారు. అప్పటివరకు శరవేగంగా సాగుతున్న రాజధాని నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపివేశారని అన్నారు. అమరావతి స్వయం సమృద్ధి ప్రాజెక్టు అని, దీనికి ప్రభుత్వం డబ్బులు ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదని చెప్పినా వారు వినిపించుకోలేదు. కావాలని అమరావతిని విధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. కానీ రాజధానికి వేసిన పునాది గొప్పది కావడంతో దీనిని ఏమీ చేయలేకపోయారని అన్నారు. గతంలో హైదరాబాద్‌లో కూడా నేను డబ్బులు ఖర్చు పెట్టలేదు. భూమి, నీరు ఇచ్చాం. దీంతో అక్కడ సంపద సృష్టి జరిగింది. ప్రభుత్వ డబ్బు అవసరం లేకుండా హైదరాబాద్‌ని అభివృద్ధి చేశాం. ఉపాధికి కేంద్రంగా మారుస్తాం. పేద ప్రజలకు భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడానికి అమరావతి గని లాంటిది. అలాంటి అమరావతిని పట్టుకుని స్మశానం, ఎడారి, మునిగిపోతుందని దుష్ప్రచారం చేశారు. చెన్నై, హైదరాబాద్‌కు కూడా నీళ్లొచ్చాయి. జగన్ కట్టుకున్న యలహంక ప్యాలెస్‌లోకి సైతం నీళ్లు వచ్చాయి. ఒకరు చేసిన తప్పుకు కోరుకుంటే అమరావతి ఉండదు. మనందరి పదవులకు క్షమించదు. అమరావతికి ఎంతో పవిత్రత ఉంది. ఇది దేవతల రాజధాని. అమరావతికి విట్, ఎస్ఆర్ఎం, అమృత్ వంటి ప్రఖ్యాత వర్సిటీలు వచ్చాయి. ఎక్స్ఎల్ఆర్ఐ యూనివర్సిటీ కూడా వస్తుంది. లా స్కూలు కూడా ఏర్పాటవుతుంది. దేశంలో టాప్–10 విద్యాసంస్థల బ్రాంచ్‌లు ఇక్కడికి రావాలి. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, అమరావతి మీదుగా బుల్లెట్ రైలు కావాలని కేంద్రాన్ని అడిగాం. అమరావతికి రుణం ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంకు అంగీకరించింది. అమరావతిలో నిర్మాణ పనులు జెట్ స్పీడ్‌గా సాగేలా, గ్రీన్ ఎనర్జీ మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకుంటాం.

రూ.52 వేల కోట్లతో పనులు

అమరావతే రాష్ట్ర రాజధాని అని రాష్ట్రంలో ప్రతిచోటా చెప్పానని, విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తామని కూడా చెప్పానని, అమరావతే రాజధాని అని విశాఖ, కర్నూలు వాసులతో ఒప్పించానని సీఎం చంద్రబాబు అన్నారు. కర్నూలులో హైకోర్టు బెంచ్, పరిశ్రమలు ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తాం. అమరావతిలో ఈవీ స్టేషన్లు, వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తాం. రాజధానిలో తలపెట్టిన పనులన్నీ మూడేళ్లలో పూర్తి కావాలి. ప్రజలు గెలవాలి. 1631 రోజుల పాటు రాజధానిని కాపాడుకోవడం కోసం రైతులు ఉద్యమం చేశారు. విధ్వంసం పోయింది... నిర్మాణం ప్రారంభమైంది. మనం చేసే మంచి పనులే శాశ్వతం. దేశ చరిత్రలో అమరావతి ఒక్కటే సుందరంగా ఉంటుంది. గత పాలకులు చేసిన విధ్వంసంతో నిలిచిన పనుల వల్ల రూ.7 వేల కోట్లు అదనంగా భారం పడుతోంది. రూ.52 వేల కోట్లతో పనులు ప్రారంభిస్తాం. కేంద్రం రూ.15 వేల కోట్లు అందించేందుకు ముందుకొచ్చింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఆల్ ఇండియా అధికారులు, న్యాయమూర్తుల కోసం రెసిడెన్షియల్ టవర్స్ పూర్తి చేస్తాం. అనుకున్న సమయానికి నిర్మాణాలు పూర్తి చేస్తాం. 8,603 కి.మీ సీఆర్‌డీఏ, 217 చ.కిమీ పరిధిలో రాజధాని ఉంటుంది. 16.9 చదరపు కిలోమీటర్ల పరిధిలో కోర్ కేపిటల్ ఉంటుంది. ఇదంతా అభివృద్ధి చేసేందుకు అమరావతి ప్రాంతంలో 183 కి.మీ.తో ఓఆర్ఆర్ వస్తుంది. దేశంలో ఏపీ నంబర్ వన్‌గా ఉండాలన్నది నా కల. కష్టాలు చూసి పారిపోయేవాడిని కాదు. రాష్ట్రంలో అభివృద్ధిని పట్టాలెక్కిస్తున్నాం. ఇందులో భాగంగానే అమరావతిని

- మిగతా 2 లో

బాలికకు నిప్పు

- ప్రేమ పేరుతో వంచన
- అడ్డు తొలగించేందుకు యువకుడి కుట్ర
- మైనర్ పరిస్థితి విషమం... నిందితుడి అరెస్ట్

విశాలాంధ్ర–కడప జిల్లా బ్యూరో/బద్వేలు: ఓ యువకుడు... ప్రేమించిన బాలికను అడ్డుతొలగించుకునేందుకు పథకం ప్రకారం నిప్పు పెట్టి హత్యాయత్నానికి ఒడిగట్టిన సంఘటన వైయస్సార్ జిల్లా గోపవరం మండలం పీపీ కుంట సెంచరీ ప్లైవుడ్ కంపెనీ సమీపంలోని అటవీ ప్రాంతంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు ఇలా ఉన్నాయి. బద్వేలు పట్టణం రామాంజనేయనగర్‌లో నివాసం ఉంటున్న దస్తగిరమ్మ (16) ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే వీధికి చెందిన విఘ్నేశ్ అనే యువకుడితో స్నేహంగా ఉంటోంది. అతడు కడపలో ఓ బంగారు దుకాణంలో పని చేస్తున్నాడు. విఘ్నేశ్‌కు వివాహమైంది. భార్య గర్భవతి. ఏమైందోఏమో... దస్తగిరమ్మ అడ్డు తొలగించుకోవాలని వ్యూహం పన్నాడు. కళాశాలలో ఉన్న దస్తగిరమ్మకు ఫోన్ చేసి నీవు రావాలని, నిన్ను కలవాలని, నీవు రాకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ ఫోన్ చేశాడు. ఆమె కళాశాల నుంచి ఆటోలో బయలుదేరింది. మార్గమధ్యలో పాలిటెక్నిక్ కళాశాల వద్ద విఘ్నేశ్ అదే ఆటోలో ఎక్కాడు. ఇద్దరూ పీపీ కుంట వద్ద సెంచరీ ప్లైవుడ్ సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లారు. ఇద్దరిమధ్య ఘర్షణ జరిగింది. విఘ్నేశ్... తన వద్ద ఉన్న లైటర్‌తో దస్తగిరమ్మ దుస్తులకు నిప్పంటించి పారిపోయాడు. బాలిక కాలిన గాయాలతో కేకలు వేస్తూ నడుచుకుంటూ వస్తుండడాన్ని ఓ లారీ డ్రైవర్, స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సీఐ నాగభూషణం, అర్బన్ ఎస్.ఐ శ్రీకాంత్ ఘటనా స్థలానికి చేరుకుని బాలికను

- మిగతా 2 లో

30కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ: దేశంలో విమానాలకు బాంబు బెదిరింపులు వరుసగా రావడం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. తాజాగా శనివారం తెల్లవారుజాము నుంచి 30కి పైగా విమానాలకు బెదిరింపులు వచ్చాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు విమానాలను నిలిపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు, పేలుడు పదార్థాలు లభించకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇండిగోకు చెందిన ఐదు, ఆకాశ ఎయిర్‌లైన్స్ ఐదు, విస్తారాకు చెందిన మూడు విమానాలతో ఎయిర్ ఇండియా

- మిగతా 2 లో

జేఎంఎం, కాంగ్రెస్ మధ్య సీట్ల పొత్తు ఖరారు

రాంచీ: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా ఐక్యసంఘటన కలిసికట్టుగా పోటీ చేస్తుందని జేఎంఎం అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ ప్రకటించారు. మొత్తం 81 అసెంబ్లీ స్థానాలకు గాను 70 స్థానాల్లో జేఎంఎం, కాంగ్రెస్ అభ్యర్థులు పోటీ చేస్తారని స్పష్టం చేశారు. మిగిలిన 11 సీట్ల విషయంలో భాగస్వామ్య పార్టీలైన ఆర్జేడీ, వామపక్షాలతో చర్చలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. హేమంత్ సోరెన్, జార్ఖండ్

- మిగతా 2 లో

జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణ

శ్రీనగర్ : కేంద్ర పాలిత ప్రాంతానికి రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరుతూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని మంత్రివర్గం ఆమోదించిన తీర్మానానికి జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదం తెలిపారని అధికారులు శనివారం తెలిపారు. 'గురువారం ఒమర్ అబ్దుల్లా అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం అసలు రూపంలో రాష్ట్రాన్ని పునరుద్ధరించడానికి ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది' అని అధికారిక ప్రతినిధి ఒకరు తెలిపారు. మంత్రివర్గం ఆమోదించిన తీర్మానానికి లెఫ్టినెంట్ గవర్నర్ ఆమోదముద్ర వేశారని

- మిగతా 2 లో

తమిళనాడు గవర్నర్‌ను తొలగించాలి

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

న్యూఢిల్లీ: తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని తక్షణమే పదవి నుంచి తొలగించాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా శనివారం కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తానేదో నియంతనని ఆయన అనుకుంటున్నట్లు ఉన్నారని గవర్నర్ తీరును ఆక్షేపించారు. ఈ వ్యవహారంలో రాష్ట్రపతి జోక్యాన్ని కోరారు. గవర్నర్‌గిరి సాగనివ్వరాదన్నారు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి ద్వేషాన్ని రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని రాజా దుయ్యబట్టారు. గవర్నర్ పదవిలో ఉన్న వ్యక్తులు మరింత ఒద్దికగా వ్యవహరించాలి... నియంతను అని ఆయన అనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. రవిని గవర్నర్ పదవి నుంచి రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని, గవర్నర్‌పదవికి రాజా విజ్ఞప్తి తొలగించాలని రాష్ట్రపతికి రాజా విజ్ఞప్తి చేశారు. అలాగే తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి సీపీఐ తరపున మద్దతు ప్రకటించారు. దూరదర్శన్ చెన్నై కార్యక్రమంలో 'ద్రవిడ' ప్రస్తావన రానివ్వకపోవడంపై డీఎంకే అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది వివాదాస్పదంగా మారింది. ఆ కార్యక్రమంలో గవర్నర్ రవి పాల్గొన్నారు. ఐక్యతకు భంగం కలిగించేలా ఆయన తీరు ఉందని డీఎంకే దుయ్యబట్టింది.

విద్యుత్ చార్జీలు పెంచితే ఉద్యమం

- నవంబరు 18న ఇళ్ల లబ్దిదారులతో సామూహిక అర్జీలు
- ఉచిత ఇసుక విఫలం కావటానికి ఎమ్మెల్యేలే కారణం
- రాష్ట్రంలో అవినీతి బాగా పెరిగింది
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర–విజయవాడ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలకు భిన్నంగా కార్యాచరణ ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. స్థానిక దాసరి భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రతిపక్షంలో ఉండగా తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని, ట్రూఅప్ చార్జీల పేరుతో భారం వేయబోమని, స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా మాట్లాడారని గుర్తు చేశారు. అధికారం చేపట్టిన తరువాత రూ.8,114 కోట్లు విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. ఇప్పటికే ఒక యూనిట్ విద్యుత్‌కు రూ.1.03 పైసలు ట్రూఅప్ చార్జీ ఉందని, మరల ట్రూఅప్ అంటూ మరో రూ.1.27 పైసలు భారం వేస్తున్నారని తెలిపారు. దీంతో గృహ వినియోగదారులు, పారిశ్రామిక వేత్తలు, వ్యవసాయదారులపై తీవ్రంగా విద్యుత్ చార్జీల భారం పడుతుందన్నారు. అలాగే వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయటానికి రూ.7 వేల కోట్లు వ్యయం చేయనున్నారని, ఈ భారం ప్రతి విద్యుత్ వినియోగదారునిపై పడుతుందన్నారు. ఏపీఈఆర్సీ అనుమతులు లేకుండానే హిందూజా కంపెనీకి రూ.1,234 కోట్లు దోచిపెడుతున్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అదానీతో లాలూచీపడితే చంద్రబాబు ప్రభుత్వం కూడా ఆ విధానాన్నే కొనసాగిస్తూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి లొంగిపోయిందని ధ్వజమెత్తారు. స్మార్ట్‌మీటర్ల గురించి ఏపీఈఆర్సీకి చెప్పకుండా అమలు చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని మోపితే ఇతర వామపక్ష పార్టీలను కలుపుకుని సీపీఐ పోరాటం చేస్తుందని రామకృష్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల ఇస్తామని హామీ ఇచ్చారని, వచ్చే ఏడాది నుంచి అమలు చేస్తామని చెప్పటం సరికాదన్నారు. రైతులకు కొంత ఊరటనిచ్చే ఈ పథకాన్ని కూడా భారం అవుతుందా? అని ప్రశ్నించారు. పంట నష్టపోయి ఇబ్బందుల్లో ఉన్న రైతులకు తక్షణం అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని సీఎం అచ్చెన్నాయుడును, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడును కోరారు. ఇళ్ల స్థలాలకు సంబంధించి పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇస్తామని, ఇళ్ల నిర్మాణానికి అయ్యే ఖర్చు పెంచుతామని చంద్రబాబు వాగ్దానం చేశారని చెప్పారు. దీన్ని కేవలం హామీగా కాకుండా కచ్చితంగా

- మిగతా 2 లో

వచ్చే నెలలో అసెంబ్లీ

- పక్షం రోజులు సమావేశాలు
- పూర్తిస్థాయి బడ్జెట్‌కు ప్రభుత్వ సన్నాహాలు
- సూపర్‌సిక్స్ హామీలే లక్ష్యంగా ఆర్థిక శాఖ కసరత్తు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: వచ్చే నెలలో అసెంబ్లీ శీతాకాల సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రారంభ తేదీ, ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై ఇంకా పూర్తి స్పష్టత రానప్పటికీ పక్షం రోజుల పాటు జరిగే అవకాశాలున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఆర్థికశాఖ అధికారులు ఇప్పటికే బడ్జెట్ రూపకల్పనలో తలమునకలై ఉండగా, శాసనసభ, ఆర్థిక వ్యవహారాలశాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు ఆర్థిక శాఖ అధికారులతో తరచూ సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ ఏడాది మే 13వ తేదీ సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని గత వైసీపీ ప్రభుత్వం ఫిబ్రవరి నెలలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. మొత్తం రూ.2,86,389 కోట్లకు బడ్జెట్ సమర్పించారు. 2024 ఏప్రిల్ నుంచి జులై వరకు కేటాయింపులు... తర్వాత పయ్యావుల కేశవ్ బడ్జెట్ సమావేశాల తేదీలు ఖరారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. శాసనసభ స్పీకర్

- మిగతా 2 లో

ఇదీ లోకం!

రైతు భరోసా సంగతి తర్వాత చూద్దాం, మా ప్రభుత్వం సాధించిన విజయాలకు ఈ స్వీట్లు తీసుకో బ్రో!

22-23 తేదీల్లో డ్రోన్ సదస్సు

- ఆకట్టుకోనున్న ఐదు వేల డ్రోన్ల ప్రదర్శన
- బబ్బూరు మైదానంలో విస్తృత ఏర్పాట్లు
- హాజరుకానున్న దేశ, విదేశీ ప్రతినిధులు

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: కొత్త సాంకేతికతను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 22,23 తేదీల్లో అమరావతి డ్రోన్ సమ్మిట్–2024కు సన్నద్ధమైంది. ఇందుకోసం అమరావతిని కేంద్రంగా ఎంచుకుంది. ఇప్పటికే విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది. సదస్సు ప్రారంభం రోజున ఐదు వేల డ్రోన్ల ప్రదర్శన ఆకట్టుకోనుంది. 22వ తేదీ సాయంత్రం విజయవాడ పున్నమి ఘాట్–బబ్బూరు మైదానంలో డ్రోన్ షో జరుగుతుంది. దేశ–విదేశాల నుంచి ప్రతినిధులు, పలువురు మంది నిపుణులు, వివిధ విశ్వవిద్యాలయాల నుంచి 400 మందికిపైగా హాజరవుతారు. డ్రోన్ల ఉపయోగాలు, వాటితో సాధ్యమయ్యే

- మిగతా 2 లో

శారదా పీఠానికి షాక్!

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి: విశాఖ శారదా పీఠానికి కూటమి సర్కార్ షాక్ ఇచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పీఠానికి ఇచ్చిన భూకేటాయింపును రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. అంతే కాకుండా తిరుమల శ్రీవారి సన్నిధిలో శారద పీఠం చేపట్టిన నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయన్న అభియోగాలపై చర్యలు తీసుకోవాలని టీటీడీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖలోని శారదా పీఠానికి పెందుర్తి మండలం చిన్నముషిడివాడలో 15 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. అక్కడ ఆ భూమికి బహిరంగ మార్కెట్లో దాదాపు రూ.200కోట్లకు పైబడి విలువ ఉండగా... ఎకరాకు రూ.లక్ష చొప్పున 15 ఎకరాలకు కేవలం రూ.15 లక్షలకు ప్రభుత్వం కేటాయించింది. ఎంతో విలువైన భూమిని నామమాత్రపు ధరకు ప్రభుత్వం కేటాయించడంపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపించింది. అయితే దర్యాప్తు నివేదిక ఆలస్యం కావడంపై స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. వెంటనే సంబంధిత దస్త్రం తెప్పించుకుని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టే విధంగా కేటాయించిన భూమిని రద్దు చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. అలాగే తిరుమల శ్రీవారి సన్నిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన శారద పీఠం నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని టీటీడీకి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

భూకేటాయింపు రద్దు చేసిన కూటమి సర్కార్

గిరిజనులంటే మోదీకి చిన్నచూపు

- అందుకే సంస్థల్లో ప్రాతినిధ్యం ఇవ్వరు
- వారి వారసత్వాన్ని తుడిచిపెట్టేందుకు బీజేపీ యత్నాలు
- సంవిధాన్ సమ్మాన్ సమ్మేళనంలో రాహుల్

2లో

- మిగతా 2 లో

నెతన్యాహు ఇంటిపై డ్రోన్ దాడి

ఇజ్రాయిల్‌పై హెజ్బుల్లా ప్రతీకారం

ప్రధాని దంపతులు సురక్షితం: ఐడీఎఫ్

బీరుట్/జెరూసలేం: ఇజ్రాయిల్‌పై లెబనాన్ శనివారం ప్రతీకార దాడి చేసింది. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నివాసమే లక్ష్యంగా డ్రోన్‌లతో దాడి చేసింది. ఇదే విషయాన్ని హెజ్బుల్లాతో పాటు ఇజ్రాయిల్ రక్షణ దళాలు తెలిపాయి. అయితే ప్రాణనష్టం జరగలేదు. దాడి జరిగినప్పుడు నెతన్యాహు దంపతులు ఇంట్లో లేరని ప్రధానికి అధికార ప్రతినిధి వెల్లడించారు.

నెతన్యాహు కార్యాలయం కూడా ఒక ప్రకటనలో ఇదే విషయాన్ని స్పష్టంచేసింది. హెజ్బుల్లా డ్రోన్లను ఐరన్ డోమ్ ఆపలేకపోయిందని తెలుస్తోంది. లెబనాన్ వైపు నుంచి మూడు డ్రోన్లతో దాడి జరిగిందని, వాటిలో రెండింటిని కూల్చివేశామని ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. ఒక డ్రోన్ సిజేరియాలోని ప్రధాని నివాస భవనాన్ని డ్రోన్ ఢీకొట్టగా మరో రెండు డ్రోన్లను అడ్డుకున్నట్లు ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ప్రకటన పేర్కొంది. హమాస్ అధినేత యాహ్యా సిన్వర్‌ను మట్టుబెట్టినట్లు ఇజ్రాయిల్ ప్రకటించింది. ఇదే క్రమంలో తమ దాడులను మరింత తీవ్రతరం చేయబోతున్నట్లు హెజ్బుల్లా హెచ్చరించింది. అదే విధంగా ఉత్తర ఇజ్రాయిల్‌లోకి 115 ప్రొజెక్టైల్స్‌తో హెజ్బుల్లా దాడి చేసిందని ఇజ్రాయిల్ సైన్యం పేర్కొంది. ప్రొజెక్టైల్స్‌ను ఐరన్ డోమ్ అడ్డుకున్నట్లు తెలిపింది. దీంతో సైరెన్లు క్రమంగా మోగినట్లు వెల్లడించింది.

హమాస్‌కు మరణం లేదు: ఖమేనీ

సిన్వర్ మరణం బాధాకరమని ఇరాన్ అధినేత ఆయాతుల్లా అల్ ఖమేనీ అన్నారు. ఆయనకు ముందు అనేక మంది పలస్తీనా మిలిటెంట్ నేతలు ప్రాణాలు కోల్పోయారు. హమాస్ బలహీనపడలేదు. చెక్కుచెదరలేదు.

'హమాస్ సజీవం- అమరం' అంటూ ఖమేమీ వక్కాణించారు. సిన్వార్ బలిదానం ఖాళీగా పోదన్నారు. ఇజ్రాయిల్‌పై ప్రతిఘటన సిన్వర్ మరణంతో ఆగబోదని స్పష్టం చేశారు.

ఇరాన్‌ను ఇజ్రాయిల్ రెచ్చగొడుతోంది: టర్కీ

లెబనాన్, గాజాలో భీకర పోరుతో ఇరాన్‌ను ఇజ్రాయిల్ రెచ్చగొడుతోందని టర్కీ విదేశాంగ మంత్రి హకన్ ఫిదన్ అన్నారు. ఇరాన్ విదేశాంగ మంత్రితో కలిసి ఇస్తాంబుల్‌లో ఉమ్మడి విలేకరుల సమావేశంల ఆయన మాట్లాడుతూ ఇజ్రాయిల్ దూకుడుతో ఇరాన్ చట్టపరంగా చర్యలు తీసుకోక తప్పడంలేదన్నారు. ఇజ్రాయిల్‌పై అక్టోబరు 1న టెహ్రాన్ జరిపిన క్షిపణి దాడికి మద్దతు తెలిపారు.

గాజాలో జబాలియాపై దాడిలో 33 మంది మృతి

ఉత్తర గాజాలోని జబాలియా శిబిరంపై ఇజ్రాయిల్ దాడిలో 33 మంది చనిపోయినట్ల పౌర రక్షణ సంస్థ తెలిపింది. 33 మంది చనిపోగా పదుల సంఖ్యలో పలస్తీనియన్లకు గాయాలు అయ్యాయని అధికారి మహమూద్ బస్సల్ వెల్లడించారు. అల్ అవదా ఆసుపత్రి అధికారి స్పందిస్తూ టల్ అల్ జాతర్ క్యాంపుపై దాడిలో 22 మంది పలస్తీనియన్లు చనిపోగా 70 మందికి గాయాలయ్యాయన్నారు. గతేడాది అక్టోబరు 7 నుంచి ఇజ్రాయిల్ కొనసాగిస్తున్న దురాక్రమణ, మారణహోమంతో ఇప్పటివరకు 42,510 మంది పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోగా, 99,637 మంది గాయపడ్డారని గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. అదే విధంగా లెబనాన్‌లో 2,418 మంది చనిపోగా 11,336 మందికి గాయాలు అయినట్లు లెబనాన్ మంత్రిమండలి తెలిపింది.

గత 24 గంటల్లో దక్షిణ లెబనాన్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో 87 వైమానిక దాడులు జరిగినట్లు వెల్లడించింది. మరోవైపు 60 మంది హెజ్బుల్లా సభ్యులను మట్టుబెట్టినట్లు ఐడీఎఫ్ ప్రకటించుకుంది. హెజ్బుల్లా లక్ష్యంగా లెబనాన్‌పై ఇజ్రాయిల్ విరుచుకుపడటంతో సెప్టెంబరు 23వ తేదీ నుంచి ఇప్పటివరకు 2,35,948 మంది సిరియన్లు, 1,35,181 మంది లెబనాన్ ప్రజలు సిరియా భూభాగాన్ని వీడారని లెబనాన్ అధికారులు వెల్లడించారు.

30కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు

(మొదటిపేజీ తరువాయి)

ఎక్స్‌ప్రెస్, స్పైస్‌జెట్, స్టార్ ఎయిర్, అలయన్స్ ఎయిర్ విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఢిల్లీ నుంచి లండన్ బయల్దేరిన విస్తారా విమానానికి బెదిరింపులు రావడంతో దాన్ని జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్‌కు దారిమళ్లించారు. పారిస్-హాంకాంగ్, ఢిల్లీ-పారిస్ విస్తారా విమానాలకు ఈ తరహా బెదిరింపులు రాగా.. వాటిని అత్యవసరంగా దించేశారు. ముంబై-ఇస్తాంబుల్, ఢిల్లీ-ఇస్తాంబుల్, జోధ్‌పూర్-ఢిల్లీ, హైదరాబాద్-చండీగఢ్, జెడ్డా-ముంబై ఇండిగో విమానాలకు ఉదయం బెదిరింపులు వచ్చాయి. వీటిల్లో కొన్నింటిని అత్యవసరంగా ల్యాండ్ చేశారు. మరికొన్నింటి టేకాఫ్‌ను ఆపేసి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. ఈ పరిణామాలపై ఇండిగో స్పందించింది. ప్రయాణికుల భద్రతే తమకు అత్యధిక ప్రాధాన్యం అని, దీనిపై సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపింది. దుబాయ్ నుంచి జైపూర్‌కు వచ్చిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ (ఐఎక్స్ 196) విమానానికి బెదిరింపులు రావడంతో దాన్ని జైపూర్‌లో అత్యవసరంగా దించేశారు. బెంగళూరు నుంచి ముంబైకి వెళ్లేందుకు టేకాఫ్‌కు సిద్ధమైన ఆకాశ ఎయిర్‌లైన్స్ (క్యూపీ1366) విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన అధికారులు ప్రయాణికులను విమానం నుంచి దింపి క్షుణ్ణంగా పరిశీలించారు. తర్వాత అది నకిలీ బెదిరింపుగా తేలింది. దీంతో పాటు ఈ సంస్థకు చెందిన మరో నాలుగు విమానాలకు కూడా బెదిరింపులు వచ్చాయి. వారం రోజుల్లో దాదాపు 70కి పైగా విమానాలకు ఇంటువంటి నకిలీ బాంబు బెదిరింపులు రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వరుస బాంబు బెదిరింపులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ బెదిరింపులను నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. అందులో భాగంగా బాంబు బెదిరింపులకు పాల్పడే వ్యక్తులపై నిషేధం విధించే అవకాశం ఉందని పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఇటీవల తెలిపారు. ఇప్పటికే ఉన్న నిబంధనల్లో మార్పులు చేయాల్సి ఉందన్నారు.

భారత దౌత్యవేత్తలపై నిఘా

వియన్నా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే ఊరుకోం: మెలానీ జోలీ

ఒట్టావా: భారత్‌తో దౌత్య సంబంధాలు తీవ్ర స్థాయిలో దెబ్బతింటున్నా కెనడా వైఖరిలో మార్పు లేదు. ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రుడ్యూ మాటల్నే విదేశాంగ మంత్రి మెలానీ జోలీ వల్లెవేశారు. తమ దేశంలో ఉన్న భారత దౌత్యవేత్తలపై నిఘా పెట్టిన ట్లు తెలిపారు. భారత్‌ను రష్యాతో పోలుస్తూ అక్కసు వెళ్లగక్కారు. వియన్నా ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే ఊరుకునేది లేదని అన్నారు. 'అంతర్జాతీయ శక్తులు కెనడా గడ్డపై ఇలా అణచివేతకు పాల్పడటం దేశ చరిత్రలో ఎన్నడూ జరగలేదు. భవిష్యత్‌లోనూ జరగనివ్వం. యూరప్‌లో ఇలాంటివి చూశాం. జర్మనీ, బ్రిటన్‌లో రష్యా ఇలాంటి పనే చేసింది. మేము వీటిని ప్రతిఘటిస్తాం' అని మెలానీ జోలీ వ్యాఖ్యానించారు. కెనడాలో మిగిలిన భారత దౌత్యవేత్తలపై నిఘా ఉంచినట్లు ఆమె చెప్పారు. రాజధాని ఒట్టావా హై కమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తలను బహిష్కరించామన్నారు. మిగిలిన వారు వాంకోవర్, టొరంటోలో ఉన్నారని, వియన్నా సదస్సుకు విరుద్ధంగా వ్యవహరించే దౌత్యవేత్తలను ఉపేక్షించబోమని మెలానీ జోలి హెచ్చరించారు. నిజ్జర్ హత్యకేసులో భారత్ ఏజెంట్ల ప్రమేయం ఉందంటూ కెనడా ప్రధాని ట్రుడ్యూ వ్యాఖ్యలతో కెనడా, భారత్ మధ్య సంబంధాలు దెబ్బతిన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం నిజ్జర్ హత్య కేసు అనుమానితులలో భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ పేరును కెనడా చేర్చింది. ఈ పరిణామం రెండు దేశాల మధ్య అగ్గి రాజేసింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన్ని, మరికొందరు అధికారుల్ని అక్కడి నుంచి వెనక్కి తెచ్చేయాలని కేంద్రం నిర్ణయించింది. దిల్లీలోని కెనడా తాత్కాలిక హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తల్ని బహిష్కరించింది. ప్రతిగా కెనడా సైతం అదే తరహా నిర్ణయం తీసుకుంది. కెనడా ప్రజలకు సంబంధించిన సమాచారాన్ని భారత దౌత్యవేత్తలు సేకరించారని, వాటిని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు అందజేశారని మరోసారి ఆరోపించారు.

యుద్ధ సామర్థ్యం పెంచుకోవాలి: జిన్‌పింగ్

షాంఘై/చైనా: యుద్ధ సామర్థ్యాన్ని మరింతగా పెంచుకోవాలని తమ బలగాలకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. తైవాన్ చుట్టుపక్కల పెద్ద ఎత్తున సైనిక విన్యాసాలను బీజింగ్ ఇటీవల నిర్వహించింది. ఈ సున్నిత సమయంలో ముఖ్యంగా జిన్‌పింగ్ పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ రాకెట్ ఫోర్స్ బ్రిగేడ్‌ను సందర్శించినప్పుడు ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. శిక్షణ మరింత పటిష్ఠంగా సాగాలని, యుద్ధాన్ని బలగాలు అన్ని విధాలా సన్నద్ధంగా ఉండాలని, తమ బలాన్ని, యుద్ధ సామర్థ్యాన్ని మరింతగా పెంచుకోవాలని జిన్‌పింగ్ సూచినట్లు స్థానిక మీడియా సంస్థలు నివేదించాయి. తన పర్యటనలో భాగంగా వ్యూహాత్మక క్షిపణి దళాలనుద్దేశించి జిన్‌పింగ్ మాట్లాడారు. పార్టీ, ప్రజలు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. 'రాజకీయ మార్గదర్శకత్వాన్ని అనుసరిస్తూ మిషన్ బాధ్యతను పటిష్ఠపర్చుకోవాలి, దళ నిర్మాణంలో ఉన్నత నాణత్య పాటించాలి' అని జిన్‌పింగ్ సూచనలు చేశారని జిన్హువా, సీసీటీవీ, కైలియాన్షె వంటి వార్తా సంస్థలు నివేదించాయి.

విద్యుత్ చార్జీలు పెంచితే ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

అమలు చేయాలని డిమాండ్ చేశారు. దీనికోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 32 లక్షల మంది లబ్ధిదారులను సమీకరించి నవంబరు 18న రాష్ట్రంలో అన్ని సచివాలయాల వద్ద సామూహికంగా అర్జీలు ఇవ్వనున్నట్లు చెప్పారు. నిర్మాణ సామాగ్రి ధరలు, కూలి రేట్లు పెరిగిన కారణంగా ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై మోదీ ప్రభుత్వాన్ని చంద్రబాబు నిలదీయలేకపోతున్నారని అన్నారు. ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ జరిగితే చంద్రబాబు ఎన్ని మంచి పనులు చేసినా ప్రజలు నమ్మరని హెచ్చరించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్టీల్ ప్లాంట్ ముఖ ద్వారం వద్ద నిలబడి స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం కానివ్వమని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ స్టీల్ ప్లాంట్ ఉన్న గాజువాక నియోజకవర్గంలోనే వచ్చిందన్నారు. స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు కూటమిపై నమ్మకం పెట్టుకున్న కారణంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడుగా ఉన్న పల్లా శ్రీనివాసరావు అక్కడ 95 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారని చెప్పారు. ఉచిత ఇసుక విధానం విఫలం కావటానికి ఎమ్మెల్యేలే కారణం అన్నారు. గతంలో కంటే ఎక్కువ ధరతో ఇసుక కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని సందేహం వ్యక్తం చేశారు. అదే పద్ధతి లిక్కర్ విషయంలో జరుగుతుందన్నారు. తక్కువ ధరకు నాణ్యమైన మద్యం లభించటం లేదన్నారు. షాపులు పెట్టుకున్న వారు 20 శాతం ప్రభుత్వానికి చెల్లించటం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందన్నారు. అయితే ప్రజాప్రతినిధులు బెల్టు షాపులు పెట్టుకొండి, మాకు 20 శాతం కమిషన్ ఇవ్వండి అంటూ డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. సీఐ, ఎస్ఐ పోస్టులకు వేలం పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రశ్నించే పార్టీగా చెప్పుకునే జనసేనకు చెందిన ఎమ్మెల్యే సీఐ పోస్టుకు రూ.46 లక్షలు వసూలు చేశారని చెప్పారు. ఇంత లంచం ఇచ్చిన వారు ఊర్ల మీదపడి దందాలు చేయకుండా ఉంటారా? అని ప్రశ్నించారు. గెలిచిన ప్రజాప్రతినిధులు అంగళ్లు పెట్టి వసూళ్లకు పాల్పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లో రాష్ట్రంలో అవినీతి బాగా పెరిగిందన్నారు. మరో ఆరు నెలల తరువాత మరింత పెరుగుతుందన్నారు. ఇది ఇలాగే కొనసాగితే అవినీతిని నియంత్రించటం చంద్రబాబు వల్లకాదని, మోదీ దిగివచ్చినా సాధ్యం కాదన్నారు. ఈ అంశాలపై శుక్రవారం జరిగిన సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేసినట్లు రామకృష్ణ తెలిపారు. సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అధ్వర్యంలో రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, నూతన ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత జరుగుతున్న పరిణామాలపై చర్చించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, జి.ఈశ్వరయ్య, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పాల్గొన్నారు.

గిరిజనులంటే మోదీకి చిన్నచూపు

రాంచీ: గిరిజనులంటే ప్రధాని మోదీకి, బీజేపీకి చిన్నచూపు అని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. గిరిజనులంటే గౌరవమంటూ మోదీ చెప్పుకుంటారు తప్ప వారికి కీలక పదవులు ఇవ్వరని, సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించరని విమర్శించారు. గిరిజనుల సంప్రదాయాలు, చరిత్ర, వారసత్వాన్ని తుడిచిపెట్టేందుకు బీజేపీ యత్నిస్తోందన్నారు. రాహుల్ గాంధీ శనివారం జార్ఖండ్ రాజధాని రాంచీలో నిర్వహించిన సంవిధాన్ సమ్మాన్ సమ్మేళనంలో మాట్లాడుతూ మోదీపై, బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మోదీ హయాంలో అణగారిన వర్గాలకు కీలక సంస్థలు/వ్యవస్థల్లో సముచిత ప్రాతినిధ్యం దక్కడం లేదన్నారు. ఎన్నికల సంఘం (ఈసీ)తో పాటు ఈడీ, సీబీఐ, ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలను బీజేపీ శాసిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లపై 50శాతం పరిమితిని తొలగిస్తుందని, కుల గణన, సంస్థాగత సర్వే చేపడుతుందని, గిరిజనులకు న్యాయం చేస్తుందని హామీనిచ్చారు. మోదీ హయాంలో గిరిజనులు, రైతులు, ఓబీసీల చరిత్ర నాశనమవుతోందని, స్వదేశీయుల గురించి నేర్పడంలో విద్యా వ్యవస్థ విఫలమవుతోందని రాహుల్ వ్యాఖ్యానించారు. గిరిజన తెగల సమస్యలను బీజేపీ పట్టించుకోదన్నారు. "ఆదివాసీ' 'వనవాసీ' అంటూ బీజేపీ చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. వారి చరిత్రను తుడిచిపెట్టేందుకు యత్నిస్తోందని... తత్వశాస్త్రం (ఫిలాసఫీ), సైన్స్, వైద్యశాస్త్రం, జీవనశైలిని మరిపించాలని చూస్తోందని దుయ్యబట్టారు. ఆదివాసీ అంటే ముందుగా వచ్చిన వారు... వనవాసీ అంటే అడవుల్లో జీవించే వారని అన్నారు. గిరిజనుల వారసత్వాన్ని, చరిత్రను, సంప్రదాయాలు, వైద్య విధానాలను నాశనం చేయాలని బీజేపీ యత్నిస్తోందని రాహుల్ దుయ్యబట్టారు. అన్ని వైపుల నుంచి దాడులు జరుగుతున్న క్రమంలో రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలను గౌరవిస్తానని ప్రధాని చెప్పుకుంటారు కానీ వ్యవస్థల్లో నుంచి వారిని తొలగిస్తారని రాహుల్ విమర్శించారు. దేశంలోని 90 మంది ఐఏఎస్‌లలో ముగ్గురు మాత్రమే ఓబీసీలు కాగా దళితులు లేరని తెలిపారు. ఆర్థిక శాఖలో గిరిజనులున్నారన్నారు. 'బీజేపీ వద్ద డబ్బు, వ్యవస్థలు, మీడియా, సీబీఐ, ఐటీ, ఈడీ అన్నీ ఉన్నాయి కానీ మా వద్ద కేవలం నిజం ఉంది. మాకు ఇంకేమీ అక్కర్లేదు. సత్యానికి కట్టుబడినంత కాలం న్యాయం తప్పక జరుగుతుంది' అని రాహుల్ అన్నారు. బీర్సా ముండా, గురునానక్ దేవ్, నారాయణ్ గురు, బసవన్న, బుద్ధా, ఫులే వంటి వారి ఆలోచనలపై దాడులను సహించేది లేదని నరేంద్రమోదీకి దేశం స్పష్టం చేసిందని లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ రాకపోవడాన్ని ఉద్దేశించి రాహుల్ వ్యాఖ్యానించారు. జార్ఖండ్ అసెంబ్లీకి ఎన్నికలు నవంబరు 13, 20 తేదీల్లో రెండు దశల్లో జరగనున్నాయి. నవంబరు 23న ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత రాహుల్ తొలిసారి జార్ఖండ్‌లో పర్యటించారు. ఇప్పటికే సీట్ల సర్దుబాటు జరగడంతో ఇండియా ఐక్య సంఘటనను గెలిపించాలని జార్ఖండ్ ప్రజలను రాహుల్ గాంధీ కోరారు.

బాలికకు నిప్పు

(మొదటిపేజీ తరువాయి)

చికిత్స నిమిత్తం బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు కడప ప్రభుత్వ ఆసుపత్రి(రిమ్స్)కు తరలించారు. బాలిక శరీరం 80 శాతం కాలిందని వైద్యులు చెబుతున్నారు. బాధితురాలి వాంగ్మూలం మేరకు బద్వేలు పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడు కోసం గాలిస్తున్నారు. త్వరలోనే నిందితుడిని పట్టుకుని అరెస్ట్ చేస్తామని సీఐ నాగభూషణం తెలిపారు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు.

కాగా, జిల్లా ఎస్పీ వీ హర్షవర్ధన్ రాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం బద్వేలు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బాధితురాలు దస్తగిరమ్మకు 80 శాతం కాలిన గాయాలు ఉన్నాయన్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం కడప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. నాలుగు ప్రత్యేక బృందాలను నియమించి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఆటో డ్రైవర్ కోసం వెదుకుతున్నామన్నారు. సమగ్ర దర్యాప్తు చేపట్టి త్వరలోనే మరిన్ని వివరాలను వెల్లడిస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

హత్యాయత్నంపై ముఖ్యమంత్రి ఆరా

ఇంటర్ విద్యార్థినికి నిప్పుపెట్టిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. అధికారులతో మాట్లాడి బాధితురాలి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాలికపై జరిగిన హత్యాయత్నంపై జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలిక ఆరోగ్య పరిస్థితిపై వైద్యాధికారులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. దస్తగిరమ్మకు, విఘ్నేశ్‌కు మధ్య అసలేంజరిగిందనే దానిపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి వివిధ కోణాల్లో ఆరా తీస్తున్నారు.

జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణ

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణ అనేది జమ్మూకశ్మీర్ ప్రజల గుర్తింపును పరిరక్షించడం, రాజ్యాంగ హక్కులను తిరిగి పొందడం అనే ఒక ప్రక్రియకు నాంది అవుతుందని ఆ ప్రతినిధి తెలిపారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం ప్రధాని నరేంద్ర మోదీతో పాటు కేంద్రంతో ఈ విషయాన్ని చర్చించేందుకు ముఖ్యమంత్రికి మంత్రివర్గం అధికారం ఇచ్చిందన్నారు. జమ్మూకశ్మీర్ ప్రత్యేక గుర్తింపు, ప్రజల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కొత్తగా ఎన్నికయిన ప్రభుత్వ విధానానికి మూలస్తంభంగా ఉందన్నారు. కాగా దీనికి సంబంధించి ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసేందుకు త్వరలో ముఖ్యమంత్రి న్యూదిల్లీకి వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. నవంబరు 4న శ్రీనగర్‌లో శాసనసభ సమావేశాలను ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించిందని, అసెంబ్లీని పిలిపించి ప్రసంగించాలని లెఫ్టినెంట్ గవర్నర్‌ను కోరినట్లు అధికార ప్రతినిధి తెలిపారు. మొదటి సమావేశాల ప్రారంభంలో శాసనసభకు లెఫ్టినెంట్ గవర్నర్ ముసాయిదా ప్రసంగాన్ని కూడా మంత్రి మండలి ముందు ఉంచారు. దీనిని తదుపరి పరిశీలించి చర్చించాలని నిర్ణయించింది. కొత్తగా ఎన్నికయిన అసెంబ్లీ సభ్యులతో ప్రమాణం చేయించేందుకు ముబారిక్ గుల్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించాలని సిఫార్సు చేసింది. శాశ్వత స్పీకర్ ఎన్నికయ్యే వరకూ గుల్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమిస్తూ లెఫ్టినెంట్ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వచ్చే నెలలో అసెంబ్లీ

(మొదటిపేజీ తరువాయి)

31 వరకు నాలుగు నెలల కాలానికి మొత్తం 40 గ్రాంట్ల కింద రూ.1,09,052.34 కోట్లకు శాసనసభ ఆమోదం తీసుకున్నారు. జూన్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. జులైలో పూర్తి స్థాయి బడ్జెట్ సమర్పించాల్సి ఉండగా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడం, ఎన్ని అప్పులున్నాయో తెలియని గందరగోళ పరిస్థితుల్లో వాయిదా వేసింది. పాత బకాయిలు, అప్పులు, సంక్షేమ పథకాల అమలుకు అయ్యే ఖర్చులు తదితర వివరాలు అన్నీ రాబట్టి ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం వెలువరించిన అనంతరం ముందుకెళ్లాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం మరోసారి ఓటాన్ ఎకౌంట్‌కు ఆర్డినెన్సు రూపంలో ఆమోదం తీసుకున్నారు. ఆగస్టు నుంచి నవంబరు వరకు రాష్ట్ర ప్రభుత్వ ఖర్చులు, ఇతర కార్యకలాపాల కోసం రూ.1,29,972.97 కోట్లతో 40 గ్రాంట్ల కింద రెండో తాత్కాలిక బడ్జెట్‌కు గవర్నర్ ఆమోదం పొందారు. ఇలా దాదాపు ఎనిమిది నెలల కాలం ఓట్ ఆన్ అకౌంట్ పద్ధతోనే గడిచిపోయింది. వాస్తవానికి చివరి నాలుగు నెలల కాలానికి కూడా బడ్జెట్ ఖర్చులకు ఆమోదం తీసుకునే అవకాశం ఉన్నా, ఏడాది మొత్తానికి పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టాల్సిందేనని అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో నవంబరులో నిర్వహించే శాసనసభ శీతాకాల సమావేశాల్లో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టి శాసనసభ ఆమోదం పొందనున్నారు. ప్రస్తుతం ఆర్థికశాఖ కార్యదర్శి ఆయా ప్రభుత్వ శాఖలతో ప్రతిపాదనలపై కూలంకషంగా చర్చిస్తున్నారు. తదుపరి దశలో మంత్రుల స్థాయిలో సమావేశాలు ఉంటాయి.

ముఖ్యంగా ఎన్నికల సందర్భంగా ఎన్డీయే కూటమి సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు భారీగా సంక్షేమ పథకాల అమలుకు హామీ ఇచ్చింది. ఇందులో భాగంగా ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే వృద్ధాప్య, ఇతర పెన్షన్ల మొత్తాన్ని పెంచి అమలు చేస్తున్నారు. మొత్తంగా చూస్తే వైసీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాల వ్యయం కన్నా మరో రూ.20 వేల కోట్ల వరకు అదనంగా ఖర్చవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టుతో పాటు, ప్రభుత్వ ప్రాధాన్యతకనుగుణంగా ఆర్థిక శాఖ బడ్జెట్ కసరత్తు నిర్వహిస్తోంది.

జేఎంఎం, కాంగ్రెస్ మధ్య సీట్ల పొత్తు ఖరారు

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ ఇన్‌ఛార్జి గులాం అహ్మద్ మీర్ శనివారం మీడియా సమావేశంలో పొత్తుల విషయాన్ని వెల్లడించారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు రెండు విడతల్లో జరగనున్నాయి. నవంబర్ 13న తొలివిడత, నవంబర్ 20న రెండో విడత పోలింగ్ జరుగుతుంది. నవంబర్ 13న ఫలితాలు వెలువడతాయి. కాగా, అసెంబ్లీ ఎన్నికల వేళ ఎన్డీయే భాగస్వామి అయిన ఏజేఎస్‌యు జాతీయ ఉపాధ్యక్షుడు ఉమాకాంత్ రజాక్, హ్యాట్రిక్ బీజేపీ ఎమ్మెల్యే కేదార్ హజ్రాలు జేఎంఎంలో చేరడం ఆ పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం పెరిగింది. 2019లో మహువా నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్‌పై పోటీ చేసిన హజ్రా... కాంగ్రెస్ అభ్యర్థి మంజు కుమారిపై 18 వేల ఓట్ల పైచిలుకు ఆధిక్యంతో గెలుపొందారు. మంజు కుమారి ఇటీవల కాంగ్రెస్ పార్టీని వీడి బీజేపీలో చేరడం, ఆమెకు మహువా నుంచి టికెట్ ఇస్తారనే ప్రచారం జరగడంతో బీజేపీని హజ్రా వీడారు. జేఎంఎంలో చేరారు. తిరిగి మహువా నుంచి జేఎంఎం టికెట్‌పై ఆయన బరిలోకి దిగనున్నారు. జార్ఖండ్ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన ఉమాకాంత్ రజాక్, కేదార్ హజ్రాలు జేఎంఎంలో చేరడంతో పార్టీకి మరింత బలం చేకూరిందని హేమంత్ సోరెన్ తెలిపారు.

ఆర్జేడీ తీవ్ర అసంతృప్తి

అయితే సోరెన్ ప్రకటనపై ఆర్జేడీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. జేఎంఎం, కాంగ్రెస్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నాయంటూ స్పందించింది. ఎన్నికల్లో పోటీ విషయంలో తమ ముందు అన్ని అవకాశాలు ఉన్నట్లు పేర్కొంది. 15-18 స్థానాల్లో ఒంటరిగానే బీజేపీని ఓడించే సత్తా ఆర్జేడీకి ఉందని వ్యాఖ్యానించింది.

జార్ఖండ్ డీజీపీపై ఈసీ వేటు

రాంచీ: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల వేళ కీలక పరిమాణం చోటు చేసుకుంది. ఆ రాష్ట్ర డీజీపీ అనురాగ్ గుప్తాను తక్షణమే పదవి నుంచి తొలిగించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. సీనియారిటీ ఉన్న అధికారికి వెంటానే తాత్కాలిక డీజీపీగా బాధ్యతలు అప్పగించాలని తెలిపింది. ఈ ఆదేశాలు తక్షణమే అమలులోకి రావాలని సాయంత్రం 7 గంటల లోపు తన నివేదికను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఈసీ సూచించినట్టు తెలుస్తోంది. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా అనురాగ్ గుప్తాపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఆయన జేఎంఎం పక్ష పాతిగా వ్యవహరిస్తున్నట్టు ఆరోపణలొచ్చాయి. ఈ క్రమంలోనే ఈసీకి అందిన ఫిర్యాదుల్ని దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు తీసుకున్నట్టు సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఈ మేరకు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

ఎన్‌సీడబ్ల్యూ చైర్‌పర్సన్ రాహత్కర్

న్యూదిల్లీ: జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌సీడబ్ల్యూ) చైర్‌పర్సన్‌గా విజయ కిశోరి రాహత్కర్ నియమితులయ్యారు. జాతీయ కమిషన్ కోసం మహిళా చట్టం -1990లోని సెక్షన్ 3 కింద ఆమెను నియమిస్తూ కేంద్రప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఆమె పదవీ కాలం మూడేళ్లు లేక 65ఏళ్లు వచ్చేంత వరకు ఉంటుందని తెలిపింది. రాహత్కర్ వెంటనే విధుల్లో చేరాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే ఎన్‌సీడబ్ల్యూ కొత్త సభ్యుల పేర్లు తెలిపింది. డాక్టర్ అర్చన మజుందార్‌ను ఎన్‌సీడబ్ల్యూ సభ్యునిగా మూడేళ్ల కోసం నియమిస్తూ మహిళా, శిశు సంక్షేమ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది.

22-23 తేదీల్లో డ్రోన్ సదస్సు

(మొదటిపేజీ తరువాయి)

అద్భుతాలు ప్రజలకు తెలియజేయడంతో పాటు, రాష్ట్రంలో డ్రోన్‌ల అభివృద్ధికి మరింత బలాన్ని చేకూర్చేలా ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. డ్రోన్‌ల రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారా లక్షలాది కొత్త ఉద్యోగాలు సృష్టించవచ్చని భావిస్తోంది. ఆర్థిక వృద్ధికి బాటలు వేసేందుకు మార్గం సుగమం అవుతుందని ఆకాంక్షిస్తోంది. డ్రోన్ సదస్సులు, పోటీలు, శిక్షణ కార్యక్రమాల ద్వారా యువతను ఈ రంగం వైపు ఆకర్షించవచ్చు. అందుకే ఈ కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. ఇటీవల విజయవాడకు వరదలు రాగా విరివిగా డ్రోన్లు వాడి బాధితులకు ఆహారం, మందులు, పాలు, వాటర్ బాటిల్స్ తదితర వస్తువులను సులభంగా అందించారు. వ్యవసాయం, విపత్తు నిర్వహణతో పాటు విభిన్న రంగాల్లో విప్లవాత్మక మార్పులను డ్రోన్లు తెస్తున్నాయి. డ్రోన్ టెక్నాలజీ వివిధ రంగాల్లో పర్యావరణ ప్రయోజనాలను కాపాడుతున్నది. ఎరువుల వాడకాన్ని తగ్గించి, పంట దిగుబడి పెంచి, కాలుష్యాన్ని తగ్గిస్తున్నాయి. వన్యప్రాణుల పర్యవేక్షణకూ దోహదమవుతున్నాయి. వేగంగా పనిని పూర్తి చేస్తున్నాయి. 2027 నాటికి గ్లోబల్ డ్రోన్ మార్కెట్ 51.4 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆర్థికవేత్తల అంచనా. భవిష్యత్తును శాసించే శక్తిగా డ్రోన్లు తయారవుతుండటం దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా డ్రోన్ల సదస్సును చేపట్టింది.

అమరావతి 2.0

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభించాం. పోలవరం 72 శాతం పూర్తి చేస్తే... వాళ్లొచ్చాక దయాఫ్రం వాల్ దెబ్బతీశారు. గోదావరి, కృష్ణా, పెన్నా నదులను అనుసంధానం చేస్తాం. రాష్ట్ర భవిష్యత్ కోసమే 2047 విజన్ డాక్యుమెంట్ తయారు చేస్తున్నామని చంద్రబాబు వివరించారు. గత ఐదేళ్లు ఏ రాక్షసుడు ఎప్పుడు వస్తాడో తెలియక ప్రజలు భయంతో బతికారు. కానీ ఇప్పుడు ప్రజలు స్వేచ్ఛగా, ఆనందంగా ఉన్నారు. ప్రజలు ఇచ్చిన గెలుపుతో రాష్ట్ర పరపతి పెరిగింది. అయితే రాష్ట్రం నుంచి భూతం పోయిందని ఏమరపాటుగా ఉండకుండా ఆ భూతాన్ని శాశ్వతంగా దూరం చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, సీఆర్‌డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్, సీఎం ముఖ్య కార్యదర్శి ప్రద్యుమ్న, లక్ష్మీపార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

కాషాయ కండువా కప్పుకున్న గౌరీ లంకేశ్ హత్య కేసు నిందితుడు

జల్నా: జర్నలిస్టు గౌరీ లంకేశ్ హత్య కేసు నిందితుడు శ్రీకాంత్ పంగర్కర్ శనివారం ఏక్‌నాథ్ షిండే పార్టీలో చేరారు. మహారాష్ట్ర అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనున్న తరుణంలో ఓ నేరస్తుడికి శివసేన (షిండే వర్గం) కండువా కప్పి పార్టీలో చేర్చుకుంది. 2017 సెప్టెంబరు 5న బెంగళూరులో గౌరీ లంకేశ్ హత్యకు గురయ్యారు. మహారాష్ట్రలోని దర్యాప్తు సంస్థల సహకారంతో సాగిన ఈ విచారణలో అనేక మంది అరెస్టు అయ్యారు. 2001-06లో అవిభజిత శివ సేన నుంచి జల్నా మున్సిపల్ కౌన్సిలర్‌గా ఉన్న పంగర్కర్ 2018 ఆగస్టులో అరెస్టు కాగా ఈ ఏడాది సెప్టెంబరు 4న ఆయనకు కర్నాటక హైకోర్టు బెయిల్ ఇచ్చింది. 2011లో శివసేన నుంచి టికెట్ ఆశించి భంగపడిన ఈయన హిందూ జనజాగృతి సమితిలో చేరారు. ప్రస్తుతం షిండే-శివసేన కండువా కప్పుకున్నారు. జల్నా నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలని శ్రీకాంత్ సంగర్కర్ కోరుకుంటున్నట్లు పార్టీ నేత అర్జున ఖోట్కర్ వెల్లడించారు. జల్నా స్థానం నుంచి కాంగ్రెస్ తరపున కైలాశ్ గోరంట్యాల్ బరిలో నిలవనున్నారు.

మద్యం బెల్టు షాపులను అరికట్టండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో మద్యం షాపులను జనావాసాల మధ్య, స్కూళ్లు, ప్రార్థనా స్థలాలు, దేవాలయాలకు సమీపాన పెడుతున్నారని...అనేక ప్రాంతాలలో మహిళలు, స్థానిక ప్రజలు దీనిని వ్యతిరేకిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు అన్నారు. నిబంధనల ప్రకారం జనావాసాలకు దూరంగా షాపులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రజలు, మహిళలు వ్యతిరేకించిన చోట మద్యం షాపులు పెట్టకుండా నిరోధించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వారానికి ఒక రోజు డ్రైడేగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కొత్తగా షాపులు పొందిన వారు లాభార్జన కోసం ఇప్పటికే ఇబ్బడి ముబ్బడిగా వేలం పాటలు నిర్వహించి బెల్ట్ షాపులతో ఒప్పందాలు చేసుకుంటున్నారన్నారు. నాయకులకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు కూడా వాటాలు పెడుతున్నట్లు రాష్ట్రం నలుమూలల నుండి సమాచారం అందుతోందన్నారు. బెల్ట్ షాపుల వల్ల మద్యపానం వినియోగం పెరగడమే కాకుండా నియంత్రణ లేని మద్యం అమ్మకాలు సాగుతాయన్నారు. అల్లరి మూకలు పేట్రేగి పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ఫిర్యాదులకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి... వీటిపై కఠినంగా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

స్వర్ణాంధ్ర సాధనకు కృషి: లంకా దినకర్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ 2047 అమల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పర్చాలనే లక్ష్యంతో రూపొందిస్తున్న స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాల సాధన దిశగా 20 సూత్రాల కార్యక్రమం అమలు చేయడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ 20 సూత్రాల కార్యక్రమం అమలు చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో ఆయన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... రాష్ట్రంలో 20 సూత్రాల కార్యక్రమాన్ని అందరి సహకారంతో అమలు చేసే దిశగా తాను ముందడుగు వేస్తానని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం ఇష్టానుసారం కేంద్ర నిధులను దారి మళ్లించినందునే కేంద్ర ప్రాయోజిత పథకాలు రాష్ట్రంలో సక్రమంగా అమలు కాలేదన్నారు. స్వర్ణాంధ్ర సాధనకు అందరం కలిసి కట్టుగా కృషి చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా రాష్ట్రానికి సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు అర్హులైన అందరికీ పథకాలు అందించేందుకు కృషి చేస్తున్నారని వివరించారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా డబుల్ ఇంజన్ సర్కార్ పని చేస్తోందని తెలిపారు.

విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ: పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉచిత విద్య అందించే విద్య హక్కు చట్టాన్ని రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మలిరెడ్డి కోటారెడ్డి, అధ్యక్షుడు ఎస్.నరహరి, కార్యదర్శి జి.ఈశ్వరయ్య శనివారం ఒక ప్రటనలో డిమాండ్ చేశారు. విద్యాహక్కు చట్టం, పాఠశాల విద్యార్థి శాఖ, సొసైటీ ట్రస్ట్ యాక్ట్, కార్మిక చట్టం, బాలల హక్కుల రక్షణ చట్ట నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా హక్కు చట్టాన్ని రద్దు చేస్తున్నట్లు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినట్లు , విద్యార్థి తల్లిదండ్రులు ఫీజులు చెల్లించాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చేస్తున్న బూటకపు ఈ ప్రచారాన్ని ఖండించారు. ఏ ప్రైవేటు విద్యా సంస్థ అయినా విద్యార్థి తల్లిదండ్రులను బలవంతం, ఒత్తిడి చేస్తే సంబంధిత డీఈవో, ఎంఈఓలకు బాలల రక్షణ చట్టం కింద ఫిర్యాదు చేయాలని విద్యార్థి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ రంగ విద్య సంస్థలను బలోపేతం చేయాలని, విద్య హక్కు చట్టం ద్వారా పేద, మధ్యతరగతి పిల్లలకు ఉచిత విద్యా హక్కు చట్టాన్ని పకడ్బందీగా ప్రభుత్వం అమలు చేయాలని కోరారు.

వల్లూరి ఆశయాలు ఆదర్శనీయం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-పెదకాకాని సీపీఐ రాష్ట్ర నాయకులు వల్లూరి గంగాధరరావు ఆశయాలు ఆదర్శనీయమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు కీర్తించారు. శనివారం గుంటూరు జిల్లా పెదకాకానిలోని శంకర్ కంటి ఆసుపత్రి ఎదుట స్మారక స్థూపం వద్ద సీపీఐ అధ్వర్యంలో వల్లూరి 18వ వర్థంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ వల్లూరు గంగాధరరావు 1959, 1970 సంవత్సరాలలో రెండు పర్యాయాలు పెదకాకాని సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. స్థానిక హేమలత నూలు మిల్లు వర్కర్స్ సీనియర్ అధ్యక్షులుగా, ఆంధ్రప్రదేశ్ టెక్స్‌టైల్స్ మిల్లుల ప్రధాన కార్యదర్శిగా కార్మికుల సంక్షేమం కోసం పాటుపడ్డారన్నారు. సీపీఐ గ్రామ నాయకుడి నుంచి జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎదిగారని గుర్తుచేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శిగా, విశాలాంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శిగా ఎంతో సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారని కొనియాడారు. ప్రతి కార్యకర్త ఆయన ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ గంగాధరరావు కుల వివక్షకు వ్యతిరేకంగా, పేద బడుగు బలహీన వర్గాల కోసం విశేషంగా కృషి చేశారన్నారు. ప్రతిఒక్కరూ ఆయన ఆశయాలను కొనసాగించాలని, పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. తొలుత స్థూపం వద్ద సీపీఐ, ఏఐటీయూసీ పతాకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, గంగాధరరావు కుమారుడు వల్లూరి నాగార్జున, సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, పెదకాకాని గ్రామ కార్యదర్శి డేవిడ్ రాజు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి, శ్రీనివాసరావు, భాషిద్, దర్శి లింగారావు, బాబురావు, మన్నవ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

22న చేతివృత్తిదారుల ధర్నా

రామాంజనేయులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా చేతివృత్తి దారులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేతివృత్తి దారుల సమాఖ్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఈ నెల 22న సంక్షేమ భవనాల ఎదుట జరిగే ధర్నాలను జయ ప్రదం చేయాలని చేతివృత్తి దారుల సమాఖ్య ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. పేదల సంక్షేమం కోసం సూపర్ సిక్స్ వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినప్పటికీ అమలుకు అవసరమైన కార్యాచరణకు పూనుకోవడం లేదని విమర్శించారు. కేవలం గత ప్రభుత్వం అమలు చేసిన పెన్షన్లు మాత్రమే ఇస్తున్నారన్నారు. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా చేతివృత్తి దారులకు ఆర్థిక సహాయ, సహకారాలను అందించడానికి ముందుకు రాకపోవడంతో వారు తమ వృత్తులను కొనసాగించలేక దుర్భరమైన జీవితాలను గడుపుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వం 56 చేతి వృత్తులు, కుల వృత్తులకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి నిధులు కేటాయించకుండా చేతివృత్తి దారులను దారుణంగా మోసం చేసిందన్నారు. ఈ ప్రభుత్వం అయినా చేతివృత్తి దారులను ఆర్థికంగా రుణాలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా 50 ఏళ్లు నిండిన చేతివృత్తి దారులకు, పేదలకు తక్షణమే పెన్షన్ ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా రూ.5 లక్షలకు తగ్గకుండా 50 శాతం సబ్సిడీతో స్వంత పూచీకత్తుతో రుణాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న చేతివృత్తి దారులకు బడ్జెట్‌లో 25 శాతం నిధులు కేటాయించి ఉప ప్రణాళిక ద్వారా నిధులు ఖర్చు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ 22న అన్ని జిల్లాల్లో సంక్షేమ భవనాల ఎదుట 'ధర్నా'లు నిర్వహించి వినతి పత్రాలు అందించాలని, చేతి వృత్తిదారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'సూపర్ సిక్స్' గాలికొదిలేశారు

శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: అమలు చేయని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ ను గాలికొదిలేసిందని శాసనమండలి విపక్ష నేత, మాజీమంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శనివారం సాయంత్రం విశాఖలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వానికి హామీల అమలుపై ఆరు నెలలు సమయం ఇద్దామని భావించినప్పటికీ సీఎం చంద్రబాబు ఢిల్లీ వెళ్లి వచ్చిన తర్వాత జమిలి ఎన్నికలు గురించి మాట్లాడుతున్నారని... రెండున్నరేళ్లు మాత్రమే ఈ ప్రభుత్వం అధికారంలో ఉంటుందని చెబుతున్నారన్నారు. కాబట్టి ఇచ్చిన హామీలు నెరవేర్చేలా ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారన్నారని ఆయన కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో పది వేల రూపాయాలకు వచ్చే ఇసుక నేడు రూ.15 వేలకు లభిస్తోందన్నారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తామని చెప్పిన తరువాత కూడా గత ప్రభుత్వం కంటే ఎక్కువ ధరకు ఇసుక అమ్ముతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో సీనరేజ్ చార్జీల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వచ్చేదని... ఇప్పుడు కూటమి ప్రభుత్వం సీనరేజ్ వసూలు చేయకపోయినా ఇసుక రేటు తగ్గలేదన్నారు. ట్రాక్టర్ తో ఉచితంగా ఇసుక తీసుకెళ్లేందుకు గత ప్రభుత్వంలో అనుమతి ఇచ్చేవారన్నారు. మద్యం ధరలు తగ్గిస్తామని చెప్పారని, ఎక్కడ తగ్గించారని ప్రశ్నించారు. నిత్యావసర వస్తువులు ధరలు ఆకాశాన్ని అంటాయని, తల్లికి వందనం, రైతు భరోసా ఒక్కరికైన ఇచ్చారా అని ప్రశ్నించారు. ఖరీఫ్ ముగుస్తున్న ఒక పైసా రైతు ఖాతాల్లో పడలేదని, అగ్గిపెట్టెలకు కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ప్రభుత్వాన్ని నేను ఎప్పుడూ చూడలేదన్నారు. ప్రభుత్వ అవినీతిపై వార్తలు రాస్తే తప్పుడు కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. టీడీపీ నేతల కుమ్ములాటల వలన గుర్లలో పది మంది చనిపోయారని, నాలుగు నెలల నుంచి మంచి నీటిపై పర్యవేక్షణ లేదన్నారు. మంచినీటి కాంట్రాక్ట్ తమకు ఇవ్వాలంటే, తమకు ఇవ్వాలని కుమ్మొలడకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వలన చనిపోయిన పది మందికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, విశాఖ జిల్లా వైసీపీ అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ పాల్గొన్నారు.

జగన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం

మంత్రి కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మద్యం టెండర్లు, ఇసుక రవాణాలో దోపిడీ జరుగుతోందంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. అమరావతిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పారదర్శకంగా జరిగిన మద్యం విధానంపై విమర్శలు చేయడం సిగ్గు చేటని మండిపడ్డారు. ఎక్సైజ్ విభాగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి వైసీపీ మద్యం పేరుతో దోచుకుంది నిజం కాదా అని ప్రశ్నించారు. ఎన్నడూ లేని విధంగా 2019-24 మధ్య అక్రమ మద్యం రవాణా కేసులు ఎందుకు ఎక్కువగా నమోదయ్యాయో సమాధానం చెప్పాలన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక దేశ వ్యాప్తంగా ఉన్న బ్రాండ్‌ల మద్యాన్ని ఏపీలో అందుబాటులో ఉంచేలా పాలసీ తీసుకొచ్చామని తెలిపారు. రూ.99కే క్వార్టర్ అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. రిటైర్డ్ జడ్జితో టెండర్ కమిటీ వేసి ధరలను నిర్ణయించబోతున్నామని తెలిపారు. ప్రస్తుతం నీతులు చెబుతున్న జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో జరిగిన మద్యం అక్రమాలపై చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు. కల్లు గీత కార్మికులకు కేటాయించిన షాపులకు త్వరలోనే దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అత్యంత పారదర్శకంగా మద్యం దుకాణాల కేటాయింపు జరిగిందన్నారు. జగన్ రెడ్డి ఇసుక మాఫియా కారణంగా 70 మంది భవన నిర్మాణ కార్మికులు ప్రాణాలు కోల్పోయారన్నారు. రాష్ట్రంలో 130 ఇసుక రీచ్‌లు ఎందుకు మూతబడ్డాయో సమాధానం చెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జులై 8న ఉచిత ఇసుక పాలసీని ప్రకటించామని, ఇప్పుడు ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి తెచ్చి ఎవరైనా ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో ఉచితంగా ఇసుక తీసుకెళ్లొచ్చని నిర్ణయించామని మంత్రి తెలిపారు.

గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

హోం మంత్రి అనిత

విశాలాంధ్ర-యస్.రాయవరం: గ్రామాల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలంలో పెట్టుగోళ్లపల్లి గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమానికి హాజరయ్యారు ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన గ్రామాలను అభివృద్ధి చేసేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. అందులో భాగంగా రూ.4 వేల కోట్ల నిధులతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం పనులు చేపట్టినట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సర్పంచులు అందరూ ఇబ్బందులు పడ్డారని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి పంచాయతీకి నిధులు విడుదల చేస్తున్నామన్నారు. అంతకు ముందు శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనేక మంది తమ సమస్యలను విన్నవించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి, ఎంపీడీవో సత్యనారాయణ, తహసిల్దార్ జె.రమేష్ బాబు, స్థానిక సర్పంచ్ అల్లు ప్రశాంతి, జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, టీడీపీ సీనియర్ నాయకులు ఎస్.వెంకట్రాజు, గుర్రం రామకృష్ణ, నవీన్ రాజు, తుమ్మపాల నాగేశ్వరరావు, కందుల వెంకటేశ్వరరావు, అల్లు నరసింహామూర్తి, కొప్పిశెట్టి వెంకటేష్, జానకి శ్రీను, జనసేన మండల అధ్యక్షుడు పప్పుల శివ పాల్గొన్నారు.

అవినీతిరహిత పాలనకు పెద్దపీట

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-విజయవాడ: అవినీతి, లంచాలు లేని విధంగా పాలనలో మార్పు తీసుకురావాలన్నదే తన ఆకాంక్ష అని, అందుకే కీలకమైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల బాధ్యతలను తీసుకున్నట్లు జనసేన అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో వివిధ పార్టీల నేతలు శనివారం పవన్ సమక్షంలో జనసేనపార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పవన్ మాట్లాడుతూ పాలనలో రాజీ లేకుండా, రూల్ బుక్ నిబంధనలకు అనుగుణంగా ఇటీవల బదిలీలు చేశామని చెప్పారు. అవినీతికి తావు లేకుండా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల్లో ఇటీవల చేసిన బదిలీల్లో 20 ఏళ్లకు పైబడి ఒకే దగ్గర పాతుకుపోయిన వారికి స్థాన చలనం కలిగించామని తెలిపారు. వైసీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి,ఆమె భర్త బి. రవి కిరణ్, అమలాపురానికి చెందిన కల్వకొలను తాతాజీ, గుంటూరుకు చెందిన చందు సాంబశివరావు, గుంటూరు నగరపాలక సంస్థ కార్పొరేటర్లు నిమ్మల వెంకట రమణ, సంకూరి శ్రీనివాసరావు, ఇర్రి ధనలక్ష్మి, అయిశెట్టి కనకదుర్గ... అలాగే జగ్గయ్యపేట మున్సిపాలిటీ కౌన్సిలర్లు కొలగాని రాము, కాశీ అనురాధ, తుమ్మల ప్రభాకర్ రావు, కాటగాని శివ కుమారి, తన్నీరు నాగమణి, సాధుపాటి రాజా, శ్రీమతి పాకలపాటి సుందరమ్మ, షేక్ సిరాజున్, మోరే సరస్వతి, పండుల రోశయ్య, కోఆప్షన్ మెంబర్లు చైతన్య శర్మ, ఖాదర్ బాషా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఆకుల బాజీ, వీరయ్య చౌదరి, పెడన నియోజకవర్గం నుంచి ఎంపీటీసీ జక్కా ధర్మారాయుడుతో పాటు మాజీ ఎంపీటీసీలు సర్పంచులు, నాయకులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ పీఏసీ చైర్మన్, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసే దిశగా కూటమి ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేలా నాయకులు బాధ్యతగా పని చేయాలని పార్టీలో చేరిన వారికి పవన్ కళ్యాణ్ సూచించారు. ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, పార్టీ ఉపాధ్యక్షులు బి.మహేందర్ రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను, మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య, ఉమ్మడి గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, ప్రకాశం జిల్లా పార్టీ అధ్యక్షులు షేక్ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

బడిదేవరకొండ గ్రానైట్ లైసెన్స్ రద్దు చేయండి

సీఎం చంద్రబాబుకు సీపీఐ నేత ఈశ్వరయ్య లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: పర్యావరణానికి, పంటలకు, ప్రజాజీవనానికి తీవ్ర నష్టం కలిగించే బడిదేవరకొండ గ్రానైట్ లీజు రద్దు చేయాలని, క్వారీ పనులు వెంటనే నిలుపుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి లేఖ రాశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు పూర్తిగా కొమ్ముకాస్తుందని, కొండల అక్రమ తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం తలూపడం సరికాదన్నారు. మన్యం జిల్లా ములగ గ్రామ పరిధిలోని బడిదేవరకొండకు 2017లో గ్రానైట్ తవ్వకాలకు నాటి ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందని, కొండ ... రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉందని, అనుమతులు ఇవ్వడం కుదరదని అప్పటి ఫారెస్ట్ అధికారులు ధృవీకరించారని పేర్కొన్నారు. దానికి అనుగుణంగా కొండపై గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పోడు పట్టాలు కూడా ఇచ్చారని వివరించారు. మరల అదే బడిదేవరకొండ మైనింగ్‌కు లైసెన్సులు మంజూరు చేస్తూ, పట్టాలు రద్దు చేయడం గిరిజనలను మోసం చేయడమేనన్నారు. కొండపై జీవనాధారం పొందుతున్న గిరిజనులు నాశనమైనా పర్వాలేదు అనుకుని, పర్యావరణం దెబ్బతిన్నా పర్వాలేదనుకునే ధోరణిలో ప్రభుత్వం, అధికారులు ఉంటే తదుపరి జరగబోయే పరిణామాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. బడిదేవరకొండ రెవెన్యూ, ఫారెస్ట్ అధికారుల ఉమ్మడి సర్వేలో రిజర్వ్ ఫారెస్ట్ అని తేలిన తర్వాతే 2017లో ఇచ్చిన లైసెన్సు రద్దు చేశారని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులతో కుమ్మక్కై తారుమారు సర్వేలు చేపట్టి రికార్డులను తిరగరాయడం అన్యాయం అన్నారు. ఇది గిరిజనులపై పెత్తందారులు, కార్పొరేట్‌ల దౌర్జన్యానికి ముమ్మాటికీ వత్తాసు పలకడమే అవుతుందన్నారు. నాడు లైసెన్స్ అనుమతుల రద్దులో గిరిజన పోరాటం బడిదేవరకొండ చరిత్రలో నిలిచిందని, నేడు మరల తవ్వకాల పనులు చేపడితే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. తక్షణమే బడిదేవరకొండ గ్రానైట్ తవ్వకాలను నిలుపుదల చేయాలని, లీజు లైసెన్సులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సీఎం సహాయనిధికి బార్ కౌన్సిల్ రూ.10 లక్షల విరాళం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతుగా ఏపీ బార్ కౌన్సిల్ శనివారం రూ.10 లక్షలు విరాళంగా అందించింది. ముఖ్యమంత్రి చంద్రబాబును ఉండవల్లి నివాసంలో కలిసి చెక్కును బార్ కౌన్సిల్ ప్రతినిధులు అందజేశారు.

విద్యారంగాన్ని కూటమి ప్రభుత్వం కాపాడింది

మాజీ మంత్రి పీతల సుజాత

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: వైకాపా హయాంలో పాఠశాల విద్యలో అల్లకల్లోలం సృష్టించిన జీఓ-117ను అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని కూటమి ప్రభుత్వం మాట ఇచ్చిన విధంగా నిర్ణయం తీసుకుందని మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె విలేఖరలతో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఇబ్బంది పెట్టేలా వైసీపీ తెచ్చిన జీవో 117 విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు. వైసీపీ పాలనలో చేసిన పాపాలను ప్రక్షాళన చేస్తూ జగన్మోహన్ రెడ్డి నిర్వీర్యం చేసిన విద్యా వ్యవస్థను మంత్రి లోకేష్ గారు గాడిన పెడుతున్నారన్నారు. జగన్మోహన్ రెడ్డి అవగాహనారాహిత్యం, అనాలోచిత నిర్ణయాలతో విద్యారంగాన్ని సర్వనాశనం చేశాయని విమర్శించారు. తరగతుల విలీనం, ఉపాధ్యాయుల సర్దుబాటు, టీచర్లకు వారానికి 42 పీరియడ్ల బోధన, ప్రాథమిక స్థాయిలో 20 మందికి ఒక టీచర్ లాంటి వైసీపీ ప్రభుత్వం బుర్ర తక్కువ ఆలోచనల ఫలితంగా పాఠశాల విద్య సర్వనాశనమైందన్నారు. ఇది జగన్మోహన్ రెడ్డి విధ్వంసకర పాలనకు నిదర్శనమని అన్నారు. ఉపాధ్యాయులను మద్యం షాపుల వద్ద కాపలా పెట్టడం, మరుగుదొడ్లు శుభ్రం చేయించటం వంటి పనులతో వారిని అవమానించిన నీచ చరిత్ర జగన్ రెడ్డిదన్నారు. రానున్న కాలంలో విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చి, విద్యార్థుల భవిష్యత్తును బంగారుమయం చేసేందుకు లోకేష్ గారు, కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుంది అని ఆమె అన్నారు.

ప్రశాంతంగా ముగిసిన టెట్ పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్షలు (టెట్) శనివారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం, మధ్యాహ్నం పేపర్-2ఏ సాంఘిక శాస్త్ర విభాగంలో అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. 23,219 మందికి గాను 20,350 మంది (87.64శాతం) అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం 68 సెంటర్లలో జరిగిన పేపర్-2ఏ సాంఘిక శాస్త్ర పరీక్షకు 12,867 మందికి 11,184 మంది (86.92 శాతం), మధ్యాహ్నం 63 సెంటర్లలో జరిగిన పేపర్-2ఏ పరీక్షలకు 10,352 మందికి 9,166 మంది (88.54 శాతం) హాజరయ్యారు. ఉపాధ్యాయ అర్హత పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ఏపీ టెట్ కన్వీనర్ ఎం.వి. కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కు నందిగం సురేశ్

విశాలాంధ్ర-తుళ్లూరు: వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను పోలీస్ కస్టడీకి తరలించారు. తుళ్లూరు మండలంలోని వెలగపూడి దళితవాడలో జరిగిన రాళ్ల దాడిలో మెండెం మరియమ్మ అనే వృద్ధురాలు చనిపోయింది. తుళ్లూరు పోలీసులు ఈ కేసులో నిందితుడిగా ఉన్న సురేశ్‌ను శనివారం మధ్యాహ్నం గుంటూరు జైలు నుంచి తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కేసులో రిమాండ్ ఖైదీగా గుంటూరు జైలులో ఉన్న సురేశ్‌ను కేసు విచారణ నిమిత్తం కస్టడీకి ఇవ్వాలని తుళ్లూరు పోలీసులు పిటీషన్ వేయగా మంగళగిరి కోర్టు అనుమతించింది. సురేశ్‌ను డీఎస్పీ మురళీకృష్ణ, సీఐలు వెంకటేశ్వర్లు, అంజయ్య బృందం రెండు రోజుల పాటు విచారించనున్నారు. సోమవారం మధ్యాహ్నం గుంటూరు జైలుకు తరలిస్తారు. సురేశ్ పోలీస్ స్టేషన్‌కు వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, కొంతమంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చారు.

సంపాదకీయం

మాట తప్పుతున్న ఉమర్ అబ్దుల్లా

ఎన్నికల ప్రణాళికలను పొల్లు పోకుండా అమలు చేయడానికి ఏ రాజకీయ పార్టీకైనా అసాధ్యం కావొచ్చు. కాని ఎన్నికల్లో విజయం సాధించిన తరవాత తమ సైద్ధాంతిక నిబద్ధతకు నిదర్శనాలైన హామీలను అమలు చేయకుండా విస్మరించడం ఫక్తు వాగ్దాన భంగమే. సెప్టెంబర్ చివరలో జమ్మూ-కశ్మీర్ శాసనసభ ఎన్నికలలో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ పొత్తు కుదుర్చుకుని పోటీ చేశాయి. 2019 ఆగస్టు అయిదున బీజేపీ రద్దు చేసిన రాజ్యాంగంలోని 370వ అధికరణాన్ని, ఈ క్రమంలో కోల్పోయిన కశ్మీర్ రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణ నేషనల్ కాన్ఫరెన్స్ ప్రణాళికలో స్పష్టంగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్థానంలో ఆసీనులైన ఉమర్ అబ్దుల్లా ఇప్పుడు కేవలం రాష్ట్రప్రతిపత్తి పునరుద్ధరణ గురించే మాట్లాడుతున్నారు. 370వ అధికరణం పునరుద్ధరణ ప్రస్తావనే తీసుకు రావడంలేదు. కానీ ఎన్నికల ప్రచార సమయంలోనే ఆయన ఈ విషయంలో సన్నాయి నొక్కులు మొదలు పెట్టారు. 370వ అధికరణం పునరుద్ధరణ గురించి ప్రయోజనం లేదు అని ముందే ఈ విషయంలో కాడి కింద పడేశారు. ఎన్నికలకు ముందు నేషనల్ కాన్ఫరెన్స్ విడుదల చేసిన ఎన్నికల ప్రణాళికలో 12 గ్యారెంటీలు ఇచ్చింది. 2000 సంవత్సరంలో జమ్మూ-కశ్మీర్ ఆమోదించిన తీర్మానం ప్రకారం "స్వయం ప్రతిపత్తి" సాధించడానికి పాటు పడడంతో పాటు 370వ అధికరణ, 35ఎ అధికరణం పునరుద్ధరణ కోసం కృషి చేస్తామని పేర్కొంది. కానీ ఇప్పుడు కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణ ప్రస్తావన మాత్రమే చేస్తోంది. భూమిలేని వారికి భూమి పంపిణీ చేస్తామని. దీర్ఘకాలికంగా భూములను సాగు చేస్తున్న వారికి ఆ భూములు కేటాయిస్తామని కూడా వాగ్దానం చేసింది. దీనికోసం పక్కా ప్రణాళిక రూపొందిస్తామని కూడా చెప్పింది. కశ్మీర్ సమస్య పరిష్కరించడానికి భారత, పాకిస్థాన్ మధ్య చర్చలు కొనసాగడానికి మద్దతిస్తామని కూడా తెలియజేసింది. జైళ్లల్లో మగ్గుతున్న వారిని విడిపిస్తామనీ చెప్పింది. తీవ్రమైన నేరారోపణలు ఏవీ లెకుండా జైలు శిక్ష అనుభవిస్తున్న వారిని విడుదల చేయిస్తామని కూడా మాట ఇచ్చింది. రాజకీయ ఖైదీలందరికీ క్షమాభిక్ష ప్రసాదించేలా చూస్తామని నేషనల్ కాన్ఫరెన్స్ తెలియజేసింది. శాంతియుత పరిస్థితిని ఏర్పాటు చేయడంకోసం ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న వారి గురించి దాపరికంలేని రీతిలో పరిశీలన చేయిస్తామని ఉమర్ అబ్దుల్లా పార్టీ పేర్కొన్నది. ఈ విషయంలో అనవసర జాప్యాన్ని నిరోధిస్తామని, పాస్‌పోర్టు పరిశీలనా క్రమాన్ని సులభతరం చేస్తామని కూడా ఉమర్ పార్టీ హామీ ఇచ్చింది. అక్రమంగా, అన్యాయంగా ఉద్యోగాలలోంచి తొలగించిన వారి సమస్య పరిష్కరిస్తామని కూడా వాగ్దానం చేసింది. రహదారుల్లో అనవసరంగా జనాన్ని వేధించడానికి అడ్డుకట్ట వేస్తామని అన్నది. నేషనల్ కాన్ఫరెన్స్ జారీ చేసిన ఎన్నికల ప్రణాళికలో నిప్పుల్లో చింత పిక్కలు ఏరే రీతిలో బీజేపీ ఖైదీలను విడిపించడం, 370వ అధికరణం పునరుద్ధరణ రాష్ట్ర ప్రభుత్వ అధికార పరిధిలో లేదని రేవణాలు తీసింది. నేషనల్ కాన్ఫరెన్స్ ప్రజలను దోపిడీ చేసి తీవ్రవాదాన్ని పెంచి పోషించిందని బీజేపీ ఆరోపించింది. 2019 ఆగస్టు అయిదున 370వ అధికరణం రద్దు చేసిన తరవాత తీవ్రవాదం ఏ మేరకు తగ్గిందో తెలియదు. అడపా దడపా గత అయిదేళ్ల కాలంలో తీవ్ర వాద సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. 370వ అధికరణం అమలులో ఉండడమే తీవ్రవాదానికి ఊతం ఇచ్చిందని బీజేపీ వితండవాదం చేసింది. అదే నిజమైతే 370వ అధికరణం రద్దు అయిన తరవాత తీవ్రవాదం దానంతట అది ఆగిపోయి ఉండాలి. అలా జరగక పోవడమే కాక తీవ్రవాదం కశ్మీర్‌కే పరిమితం కాకుండా జమ్మూ ప్రాంతానికీ విస్తరించడం వాస్తవం.

2019 ఆగస్టు అయిదున 370వ అధికరణం, 35ఎ అధికరణం రద్దు చేయడంతో పాటు ఆ ప్రాంతానికి రాష్ట్ర ప్రతిపత్తి లేకుండా చేసి, జమ్మూ-కశ్మీర్‌ను, లడాఖ్ ప్రాంతాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడగొట్టింది బీజేపీ. ఇది సరైన చర్యే అయితే జమ్మూ-కశ్మీర్ ఈ అయిదేళ్ల కాలంలో స్థిమితంగా ఉండాల్సింది. తీవ్రవాదం మటుమాయం అయిఉండాలి. తీవ్రవాద కార్యకలాపాలు కొంత తగ్గు ముఖం పట్టినట్టు కనిపించిందనుకున్నా అది అయిదేళ్లుగా అణచివేత చర్యలు అమలు చేయడమే ప్రధాన కారణం. 370వ అధికరణం రద్దు చేసిన సమయంలో అక్కడి రాజకీయ పార్టీల నాయకులందరినీ కేంద్ర ప్రభుత్వం నిర్బంధంలో ఉంచింది. వారిలో ప్రముఖులను జైలులో పెట్టి ఉండకపోవచ్చు. కానీ వారు ఇల్లు వదిలి బయటకు రాకుండా అనేక ఆంక్షలు విధించింది. వారు అక్షరాలా గృహ నిర్బంధంలో ఉండాల్సి వచ్చింది. జమ్మూ కశ్మీర్‌లో తీవ్రవాదం ప్రబలడానికి ఉన్న అనేక కారణాల గురించి మోదీ ప్రభుత్వం ఆలోచించిన జాడలే లేవు. పై మెరుగులతో, అక్కడి ప్రజల స్వేచ్ఛ హరించడంతో సమస్య పరిష్కారం అవుతుందన్న తప్పుడు ఆలోచనతోనే బీజేపీ కేంద్ర నాయకత్వం ఆలోచించింది. బీజేపీ తీసుకున్న నిర్ణయాలు సరైనవి కావని ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీజేపీ తెల్ల మొహం వేయవలసి రావడమే ప్రబల నిదర్శనం. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలు ఆమోదించి ఉన్నట్టయితే బీజేపీని జనం అక్కున చేర్చుకుని, ఆదరించి భారీ ఎత్తున ఎన్నికల్లో గెలిపించాల్సింది. అలా ఎంతమాత్రం జరగలేదు. బీజేపీకి దక్కిన విజయాలు జమ్మూ-కశ్మీర్ కే పరిమితం. కశ్మీర్ లోయలో పోటీ చేయడానికే బీజేపీ జడవాల్సి వచ్చింది. కొద్ది నెలల ముందు జరిగిన సార్వత్రిక ఎన్నికలలో కశ్మీర్ లోయలోని లోక్‌సభ స్థానాలకు కనీసం పోటీ చేసే సాహసం కూడా బీజేపీ చేయలేక పోయింది. అణచివేత ద్వారా జమ్మూ-కశ్మీర్ లో శాంతి భద్రతలు నెలకొనేట్టు చేయగలం అన్న బీజేపీ వ్యూహం సంపూర్ణంగా బెడిసి కొట్టింది. దశాబ్దాల కింద నిర్వాసితులైన కశ్మీరీ పండితులు మళ్లీ వారి సొంత గూటికి చేరుకున పరిస్థితి ఉంటుందని బీజేపీ చెప్పిన మాట కూడా అమలులోకి రానేలేదు. కశ్మీరీ పండితులను సొంత గూటికి చేర్చడానికి గత అయిదేళ్ల కాలంలో మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా కనిపించే చర్యలు తీసుకున్న దాఖలాలే లేవు. నిర్వాసితులై పోయి చెల్లా చెదురై వివిధ ప్రాంతాలలో శరణు పొందిన కశ్మీరీల పరిస్థితి మునుపటిలాగే ఉంది. యథాతథ స్థితి కొనసాగుతోంది. పోనీ గత అయిదేళ్ల కాలంలో కశ్మీర్ ప్రజల జీవన స్థితిగతులు ఏమైనా మారాయా అంటే అదీ లేదు. ఉపాధి అవకాశలు పెరగడం, నిరుద్యోగ సమస్య తీరకపోయినా కనీసం తగ్గిన పరిస్థితీ లేదు. 370వ అధికరణం తొలగిస్తే కశ్మీర్‌లో పారిశ్రామికాభివృద్ధి ఊపందుకుంటుందని కేంద్ర ప్రభుత్వం ప్రచారం చేసింది. అదీ జరగలేదు. కేంద్ర ప్రభుత్వం కశ్మీర్‌ను ముస్లిం జనాభా అధికంగా ఉన్న రాష్ట్రంగానే పరిగణించింది తప్ప ప్రజల బాగోగుల కోసం చేసింది ఏమీ లేదు. నేషనల్ కాన్ఫరెన్స్ సైతం ఇచ్చిన మాట తప్పడం, అసలు సమస్యల పరిష్కరించకుండా కాడి కింద పడేయడంవల్ల మిగిలేది నిరాశే.

పెట్టుబడి సాయం ఏదీ?

కె.వి.వి.ప్రసాద్

చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ప్రకటించినట్లు ప్రతి రైతుకు 20 వేల పెట్టుబడి సాయం ఎప్పుడు అందుతుందా అని రైతన్నలు ఎదురుచూస్తున్నారు. ఎన్నికల్లో గెలిచి నూతన ప్రభుత్వం ఏర్పడి 150 రోజులు పూర్తయింది. ఖరీఫ్ పంట కాలంలో పెట్టుబడి సాయం ప్రభుత్వం ఇస్తుందనేది అత్యాశే అవుతుంది. అయితే ఖరీఫ్ ముగిసి రబీ పంటల పెట్టుబడికైనా ప్రకటించిన సాయం అందేనా అని రైతన్నలు ఆశపడటం తప్పుకాదు. కానీ తమ ఆశలు మొగ్గతొడిగి ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసేది ఎప్పుడా అని ఎదురుచూడటం రైతుల వంతైంది. ఎన్నికల్లో గెలిచి ఆధికారం చేబడితే రైతులు, కౌలు రైతులకు రూ.20వేల వంతున సాగుసాయం ఆందిస్తామన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రెండువేల వంతున రైతుల ఖాతాల్లో సొమ్ము జమచేసింది. కేంద్రం మూడు విడతలుగా ఆరువేల రూపాయలు అందిస్తున్నది. ఈ మొత్తానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మొత్తం జోడించి రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉన్నది. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వంతో కలిపి వైసీపీ ప్రభుత్వం 13,500 రూపాయలు రైతు భరోసాగా అందించింది. కేంద్రం మూడు దఫాలుగా 6వేల రూపాయల చొప్పున అందించింది. రాష్ట్రం మిగిలిన 7,500 రూపాయలు తమ వంతుగా కలిపి ఇచ్చింది. గత ప్రభుత్వం చివరిసారిగా 2023 మార్చిలో 53 లక్షల 5 వేల 290 మంది రైతులకు సుమారు 7,200 కోట్ల రూపాయలు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, వైఎస్ఆర్ రైతు భరోసా కలిపి ఇచ్చారు. ఇందులో 1,59,674 మంది కౌలు రైతులకు దాదాపుగా రూ.200 కోట్లు రైతు భరోసాగా అందించారు.

రాష్ట్రంలో, దేశంలో పాలకవర్గాలు అనుసరించిన విధానాల పుణ్యమాని రైతులు అప్పులపాలౌతున్నారు. దేశ వ్యాప్తంగా రైతాంగ ఆత్మహత్యలు పెరుగుతూనే ఉన్నాయి. రెండు పర్యాయాలు నరేంద్రమోదీ ప్రభుత్వ హయాంలో 1 లక్షా 12 వేలమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దేశ వ్యాప్తంగా ప్రతి రైతుకుటుంబంపై 74,521 రూపాయల అప్పు ఉన్నది. రాష్ట్రంలో సైతం ఆనాటి వైసీపీ ప్రభుత్వంలో సుమారు 2,500 మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం మూడు నల్ల వ్యవసాయ చట్టాలను తెచ్చింది. ఇందుకు వ్యతిరేకంగా 13 మాసాల రైతుల ఆందోళన అనంతరం మోదీ ప్రభుత్వం ఆ నల్ల చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అయితే రైతాంగానికి ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయకుండా తన మోసకారితనాన్ని రుజువు చేసుకున్నది. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం రైతాంగ ప్రయోజనాలను విస్మరిస్తూనే వచ్చింది. భూములిచ్చిన అమరావతి రైతుల ఆందోళనను పెడచెవిన పెట్టటమేకాకుండా వారిపై దాడులకు పూనుకున్నది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు, కనీస మరమ్మతులను విస్మరించింది. ఆ దశలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రైతు, కౌలు రైతులకు ఎకరాకు 10వేల సాగుసాయం ఇవ్వాలని దశలవారీ ఆందోళన చేబట్టి రాష్ట్ర వ్యాప్తంగా రైతాంగాన్ని చైతన్యపరిచింది. 2023 జులై 30న విజయవాడలో మహాధర్నా చేపట్టింది. ఆ దశలో చంద్రబాబు తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రతి రైతుకు 20వేల రూపాయల సాగుసాయం ప్రకటించారు. ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం 100 రోజులు పూర్తిచేసుకున్నా, మరో పక్క ఖరీఫ్ సీజన్ ముగిసిపోతున్నా ప్రకటించిన సాగుసాయం రైతులకు అందించలేకపోయింది. మార్గదర్శకాల రూపకల్పన పేరుతో కాలం వెళ్లబుచ్చేపనిలో ప్రభుత్వం ఉన్నదని రైతాంగం అభిప్రాయ పడుతోంది. 2019 ఎన్నికల ముందు చంద్రబాబు ప్రభుత్వం "అన్నదాత సుఖీభవ పథకాన్ని" తీసుకువచ్చింది. ఆనాడు కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం క్రింద ఏడాదికి 6 వేల రూపాయలు పెట్టుబడి సాయానికి తోడు చంద్రబాబు ప్రభుత్వం మరో 9 వేలు కలిపి 15 వేలు ఇచ్చేలా పథకం రూపొందించారు. 2019 ఫిబ్రవరిలో పథకం తీసుకురాగా అనంతరం జరిగిన ఎన్నికల్లో ఆ ప్రభుత్వం ఓటమి పాలైంది. 2019 ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం కేంద్రం అందించే సాయంతో కలిపి 13,500 రైతులకు మూడు విడతలుగా అందిస్తూ వచ్చింది. 2024లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఓటమిపాలై చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించిన సూపర్ - 6 పథకాల్లో ఒకటిగా ప్రతి రైతుకు 20 వేలు పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. ప్రస్తుతం దానికి అనుగుణంగా పథకం పేరును కూడా మార్పు చేస్తూ " అన్నదాత సుఖీభవ"గా మార్చారు. పథకం పకడ్బందిగా అమలు చేసేందుకు మార్గదర్శకాలు రూపొందిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ స్థితిలో తెలంగాణలోని అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం "రైతుబంధు పథకాన్ని" ఎలా ఆమలు చేసింది, ఆమలులో జరిగిన లోపాలు, వాటిపై రైతాంగ అభిప్రాయాలు సేకరించాలి. ప్రస్తుత రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఎకరాకు 15 వేలు ఇస్తామని ప్రకటించింది. మార్గదర్శకాలు రూపొందించేందుకు మంత్రులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఈలోగా రైతులకు రెండు లక్షల రూపాయల వరకు ఉన్న అప్పులను రద్దు చేసింది. కానీ ఇంత వరకు రైతు భరోసా రైతులకు ఇవ్వలేదు. మన రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం 2014-19 వరకు అధికారంలో ఉన్న సమయంలో 2014 ఎన్నికల వాగ్దానం ప్రకారం 1.50 లక్ష వంతున రైతాంగానికి రుణ మాఫీ ప్రకటించింది. 50 వేలరూపాయలలోపు రుణం ఉన్న రైతులకు ఒకేదఫాగాను మిగిలినవారికి ఐదు విడతలుగా రుణ మాఫీ చేసేందుకు మార్గదర్శకాలు రూపొందించింది. ఆనాటి 5 సంవత్సరాల తమ ప్రభుత్వ హయాంలో మూడు విడతలు మాత్రమే రైతాంగానికి రుణ మాఫీ చేయగలిగింది. మరో 2 విడతల రుణమాఫీకి సంబంధించి సుమారు 9,500 కోట్లు 2019 ఎన్నికలనాటికి కూడా చెయ్యలేకపోయింది. అయితే మిగిలిన సొమ్ము చెల్లించేలా చంద్రబాబు ప్రభుత్వం రైతులకు బాండ్లు ఇచ్చింది. 2019 ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వం ఓటమిచెంది జగన్ ప్రభుత్వం ఆధికారం చేపట్టింది. చంద్రబాబు ప్రభుత్వం చెల్లించాల్సిన 4,5 విడతల రుణమాఫీ సొమ్ము చెల్లించాలని రైతులు, రైతుసంఘాలు ఒత్తిడితెచ్చినా జగన్ ప్రభుత్వం రుణమాఫీ సొమ్ము చెల్లించేందుకు ససేమిరా ఆంగీకరించలేదు. చంద్రబాబు ఎన్నికల వాగ్దానం రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో రైతులకు ఆందనేలేదు.

> **రాష్ట్రంలో, దేశంలో పాలకవర్గాలు అనుసరించిన విధానాల పుణ్యమాని రైతులు అప్పులపాలౌతున్నారు. దేశ వ్యాప్తంగా రైతాంగ ఆత్మహత్యలు పెరుగుతూనే ఉన్నాయి. రెండు పర్యాయాలు నరేంద్రమోదీ ప్రభుత్వ హయాంలో 1 లక్షా 12 వేలమంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. దేశ వ్యాప్తంగా ప్రతి రైతుకుటుంబంపై 74,521 రూపాయల అప్పు ఉన్నది. రాష్ట్రంలో సైతం ఆనాటి వైసీపీ ప్రభుత్వంలో సుమారు 2,500 మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారు.**

మరో పక్క 2018 ఖరీఫ్ సీజన్‌లో కరువుగా ప్రకటించిన కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన పంట నష్టపరిహారం సుమారు రూ.1200కోట్లు ఆనాడు ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ రైతులకు చెల్లింపులు జరగలేదు. గత ప్రభుత్వ కాలంలో రైతాంగానికి చెల్లించాల్సిన రుణమాఫీ బకాయిలు 2018 ఖరీఫ్ పంట నష్టపరిహారం బకాయిలు చెల్లించాల్సిన నైతిక బాధ్యతను ప్రస్తుత ప్రభుత్వ హయాంలో తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో నీరు- చెట్టు పథకం ద్వారా చేసిన పనులకు సుమారు 600 కోట్లు ప్రస్తుత ప్రభుత్వం చెల్లించింది. అలాగే ఎన్టీఆర్ గృహ సముదాయాలకు ఆనాటి ప్రభుత్వం చెల్లించాల్సిన సుమారు వెయ్యి కోట్ల రూపాయలను ప్రస్తుతం చెల్లించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కానీ రైతాంగ బకాయిల చెల్లింపులకు ప్రభుత్వం ముందుకు రాకపోవడం విచారకరం. 2023 ఖరీఫ్ వ్యవసాయ పంటల నష్టపరిహారం 6.35 లక్షలమంది రైతులకు సుమారు రూ. 784 కోట్లు, ఉద్యాన పంటల రైతులు 57 వేల మందికి 62 కోట్లు వెరసి మొత్తంగా సుమారు రూ. 846 కోట్లు రైతులకు చెల్లించాలి. 2023 రబీపంట కాలంలో అనంతపురం, కర్నూలు, నంద్యాల, నెల్లూరు, ప్రకాశం, సత్యసాయి జిల్లాలకు చెందిన 87 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించగా రూ.164.5కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అందాల్సి ఉన్నది. పాలకులు ఎవరైనప్పటికీ రైతాంగానికి ఎన్నికల్లో వాగ్దానాలవర్షం కురిపించడం అనంతరం విస్మరించడం పరిపాటిగా మారింది. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు నల్ల వ్యవసాయ చట్టాల వ్యతిరేక ఉద్యమ విరమణ సందర్భంగా నరేంద్రమోదీ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయకుండా మోసపూరితంగా వ్యవహరించడం పాలకుల తీరుకు ఒక చక్కని ఉదాహరణ. రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వాన ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీగా ప్రకటించిన ప్రతి సాగుదారునికి 20 వేల పెట్టుబడిసాయం రబీ పంట కాలంలో అందించేందుకు తక్షణ ప్రణాళిక రూపొందించి రైతాంగ ఆశలు వమ్ము చేయకుండా స్పష్టమైన ప్రకటన చేయాలి. 2014-19 ప్రభుత్వ కాలంలో నిలిచిపోయిన రుణమాఫీ బకాయిలు 2018 ఖరీఫ్ పంట నష్టపరిహారం 2023 ఖరీఫ్, రబీ పంటల కరువునష్టం రైతులకు అందించి తమ ప్రభుత్వంపై రైతుల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలి.

ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం

కార్మిక కోడ్‌ల అమలుకు కేంద్రం తహతహ

జ్ఞాన్ పాథక్

కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల లేబర్ కోడ్‌లను త్వరగా అమలుచేయాలని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తహతహ లాడుతోంది. ఈ లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఆందోళనను ఉధృతం చేస్తామని కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక హెచ్చరించింది. లేబర్ కోడ్‌లను అమలు చేయాలన్న వినాశకర నిర్ణయంతో కేంద్రం ముందుకు వెళితే అందుకు వ్యతిరేకంగా సమ్మెతో సహా వివిధ రూపాలలో ఆందోళన నిర్వహించనున్నామని పది కేంద్ర కార్మికసంఘాలతో కూడిన ఐక్య వేదిక తాజాగా హెచ్చరించింది. లేబర్ కోడ్‌లను సత్వరం అమలు చేయడానికి సంబంధించి కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కేంద్ర కార్మిక సంఘాలతో చర్చిస్తోంది. అయితే, కార్మికులకు హానికలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలన్న డిమాండ్‌కు కేంద్ర కార్మిక సంఘాలు కట్టుబడివుండడంతో ప్రభుత్వం ముందుకు సాగే సాహసం చేయలేక పోతోంది. దోపిడీ రహిత సమాజమే ధ్యేయంగా తమ పోరాటాలు కొనసాగుతాయని కార్మికసంఘాలు పేర్కొంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ నవంబరు 26న దేశవ్యాప్త 'జన సమీకరణ' ఆందోళన జయప్రదం చేయాలని అన్ని వర్గాలకు పిలుపునిచ్చాయి. నాలుగు లేబర్ కోడ్‌లు- వేతనాలపై కోడ్-2019, సామాజిక భద్రతపై కోడ్-2020, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులపై కోడ్-2020, పారిశ్రామిక సంబంధాల కోడ్-2020. యజమానులు చేసిన నేరాలను సైతం నేరరహితం చేయడం ద్వారా వ్యాపారాన్ని సులభతరం చేయడం, పెట్టుబడులు, వాణిజ్యం బలోపేతం చేయడం వంటి లక్ష్యంతో 44 కేంద్ర కార్మిక చట్టాలలోని 29ని ఉపసంహరించుకోవడం ద్వారా మోదీ సర్కార్ ఈ నాలుగు కార్మిక కోడ్‌లను రూపొందించింది. దేశంలో వ్యాపారాన్ని సులభతరం చేసేందుకు ఇవి చాలా కావల్సిన కార్మిక సంస్కరణలను కేంద్రం వాదిస్తోంది. శ్రామిక శక్తి ప్రయోజనాలను ఈ కోడ్‌లు కలిగివున్నాయని చెపుతోంది. అయితే పది కేంద్ర కార్మిక సంఘాలు (ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఎస్ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీ)తో కూడిన కార్మిక సంఘాల ఐక్యవేదిక ఈ లేబర్ కోడ్‌లు కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూలమైనవిగా పేర్కొంటోంది. వాటిని అమలుచేస్తే శ్రామిక శక్తిని ఆర్థిక బానిసలుగా మారుస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. నాలుగు లేబర్ కోడ్‌లకు గతంలో అభ్యంతరం చెప్పిన పశ్చిమ బెంగాల్ సైతం ముసాయిదా లేబర్ కోడ్‌లకు సాధ్యమైనంత త్వరలో ఆమోదం తెలిపేందుకు ఇటీవల సమ్మతించడంతో లేబర్ కోడ్‌ల అమలుకు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల నుంచి సమస్య ఉండబోదని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. తమ నిబంధనలు ఇంకా రూపొందించుకోని మిగిలిన రెండు రాష్ట్రాలు మేఘాలయ, నాగాలాండ్ వాటి ముసాయిదా నిబంధనలు త్వరలో రూపొందిస్తాయని కేంద్రం భావిస్తోంది. ఈ కోడ్‌లకు సంబంధించి తమ నిబంధనలకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా ఉన్నాయని కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ వర్గాలు తెలుపు తున్నాయి. ఎనిమిది కేంద్ర పాలిత ప్రాంతాలు, 28 రాష్ట్రాలలో 25 రాష్ట్రాలు ఇప్పటికే ఇందుకు సంబంధించి తమ నిబంధనలను రూపొందించాయి. అందువల్ల రాష్ట్ర నిబంధనలకు సంబంధించి కేంద్రానికి పెద్ద ఇబ్బంది ఉండదు. కార్మికులు కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి జాబితాలో ఉన్నందున నాలుగు లేబర్ కోడ్‌ల ఆమలుకు కేంద్ర, రాష్ట్రాల ఆమోదం తప్పనిసరి, అందువల్ల లేబర్ కోడ్‌ల అమలులో ప్రధాన అవరోధాలలో రాజ్యాంగ నిబంధన ముఖ్యమైనది. లేబర్ కోడ్‌ల అమలు అవశ్యకత గురించి రాష్ట్రాలను ఒప్పించడంలో కేంద్ర ప్రభుత్వం కృతకృత్యురాలైందని కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖలోని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

కార్మిక శక్తికి సంబంధించిన అనేక అంశాలు ఇప్పటికీ అపరిష్కృతంగా ఉండిపోయాయనీ, ఈ నేపథ్యంలో నాలుగు లేబర్‌కోడ్‌ల అమలు కార్మికుల జీవన స్థితిగతులను మరింత దిగజారుస్తుందని పది కేంద్ర కార్మిక సంఘాలతో కూడిన ఐక్యవేదిక కేంద్ర కార్మిక, ఉపాధికల్పన మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. 2019, 2020లో లేబర్ కోడ్‌లకు పార్లమెంట్ ఆమోదం తెలిపినప్పటి నుంచి కార్మిక సంఘాల ఐక్య వేదిక నిరసన గళం విప్పుతూనే ఉంది. ఇప్పటికి అనేక సార్లు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలు కూడా నిర్వహించింది. లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ, వాటిని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ చివరగా సెప్టెంబరు 23వ తేదీన దేశవ్యాప్తంగా అనేక నగరాలు, పట్టణాలలో వేల సంఖ్యలో కార్మికులు ప్రదర్శనలు, ఇతర నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. కరోనా మహమ్మరి విశృంఖలంగా వ్యాపిస్తున్న సమయంలో ఎటువంటి చర్చా లేకుండానే వ్యాపార వర్గాల, కార్పొరేట్, బహుళజాతి కంపెనీలకు అనుకూలంగా ఉన్న ఈ లేబర్ కోడ్‌లను పార్లమెంట్ ఆమోదించిందనీ, అందువల్ల ఈ కోడ్‌లను రద్దుచేయాలని కార్మికసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు, ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నవంబరు 26వ తేదీన దేశవ్యాప్త జన సమీకరణ కార్యక్రమ నిర్వహణలో కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు నిమగ్నమై ఉన్నాయి. చట్టాలు, కార్మిక హక్కుల కోసం ఏళ్లపాటు పోరాడి సాధించుకున్నామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ గుర్తు చేశారు.

అంబేద్కర్ బౌద్ధం ఎందుకు స్వీకరించారు?


డాక్టర్ దేవరాజు మహారాజు

'హిందువుగా పుట్టాను. కానీ హిందువుగా మరణించను'- అని డా.బి.ఆర్.అంబేద్కర్ యోలా సభలో ప్రకటించారు. ఆ తర్వాత 1956 అక్టోబరు 14న బర్మా భిక్షువు చంద్రమణి ద్వారా నాగ్‌పూర్‌లో బౌద్ధం స్వీకరించారు. అలా ఎందుకు చేయాల్సి వచ్చిందో పూర్తిగా అర్థం చేసుకోవాలంటే ఆయన పుట్టి పెరిగిన పరిస్థితుల్ని పరిశీలించాలి. ఇప్పుడు ఈ 21 వ శతాబ్దంలో ఉన్న పరిస్థితులు ఆనాడు దేశంలో 20 వ శతాబ్దంలో లేవు. అంతకు ముందు 19,18 శతాబ్దాలలో అణగారినవర్గాల జీవితం ఇంకా చాలా దయనీయంగా ఉండేది. ఉదాహరణకు అంబేద్కర్ స్కూలు విద్యార్థిగా ఉన్నప్పుడు, స్కూల్లో తాగేందుకు మంచినీళ్లు దొరికేవి కావు. దళితులకు నిర్దేశించిన కుండలోని నీరే వారు తాగాలి. ఎట్టి పరిస్థితులలోనూ పక్కనే ఉన్న అగ్రవర్ణం వారి కుండ ముట్టుకోగూడదు. నల్లాలో నీళ్లు వస్తున్నా స్వతంత్రంగా వెళ్లి నీళ్లు తాగే పరిస్థితిలేదు. దాహంగా ఉందని అభ్యర్థిస్తే, స్కూలు బంట్రోతు కరుణించి వచ్చి, నల్లా తిప్పితే దూరంగా ఉండి దోసిలి పట్టి తాగి, పక్కకు జరగాల్సిందే. క్లాసు బయట కింద కూర్చుని పాఠాలు వినాల్సిందే తప్ప, తోటి విద్యార్థులతో కలిసి క్లాసులో బెంచి మీద కూర్చునే పనిలేదు. అంబేద్కర్ తెలివైనవాడు గనుక, విషయాలు సులభంగానే గ్రహించేవాడు. ఒకసారి మేష్టారు ఒక లెక్కను ఎవరైనా వచ్చి బోర్డు మీద చేసి చూపండి అంటే- అంబేద్కర్ చేస్తానని లేచి నిలబడ్డాడు. కాని, క్లాసులోని పిల్లలంతా గోల చేశారు. ఎందుకంటే, అంబేద్కర్ దళిత బాలుడు గనక బోర్డు ముట్టుకుంటే బోర్డు వెనకాల ఉన్న అగ్రవర్ణం పిల్లల అన్నం మూటలు మైలపడిపోతాయని బాధపడిపోయారు. ఆనాటి పరిస్థితులు అలా ఉండేవి.

పాఠశాలల్లో ప్రథమశ్రేణి కేవలం బ్రాహ్మణ పిల్లలకే రావాలి. శూద్రులకు రాకూడదన్న అప్రకటిత నియమం ఉండేది. ఆరోజుల్లో బనారస్, అలీఘర్ విశ్వవిద్యాలయాల్లో దళితులకు విద్యకోసం కేటాయించిన గ్రాంట్ ఆపేశారు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య విద్యార్థులకు అన్ని సదుపాయాలుండేవి. ఈ మూడు వర్ణాల వారికి సేవ చేయడమే శూద్రుల ధర్మమని మనుస్మృతి చెప్పినదాని ప్రకారమే అంతా జరుగుతూ ఉండాలని కోరుకునేవారు. అందుకు ప్రయత్నిస్తూ ఉండేవారు కూడా! మనిషికి మనసు ఉంది. జంతువులకు లేదు. కాని, తమకు ఉన్న మనసును సంస్కారవంతంగా, నైతికతతో ఉంచుకోవాలన్న ఆలోచన అగ్రవర్ణాల వారికి ఉండేది కాదు. హిందూధర్మం అధిక సంఖ్యాకులైన శూద్రుల్ని, దళితుల్ని నిరుత్సాహపరిచేది. నిమ్నజాతుల వారి జీవితాల్లో ఆశ ఉండేది కాదు. అభ్యుదయం ఉండేది కాదు. వారు నిరాశలో పుట్టి పెరగాల్సిందే ఎదిగే అవకాశాలు ఎంత మాత్రమూ ఉండేవి కావు. అసహ్యం, నిరాదరణ, కోపతాపాలు ఎదుర్కొంటూ, అవమానాల పాలవుతూ శూద్రులు, దళితులు బలవంతంగా జీవనం కొనసాగిస్తున్న రోజులవి. అలాంటి కాలంలో అంబేద్కర్ పుట్టి పెరిగారు. అన్ని రకాల వివక్షల్ని ఎదుర్కొంటూ, ఓపికగా పోరాడుతూ, ఒక్కొక్క మెట్టూ పైకి ఎదుగుతూ వచ్చారు.

ధనికులకు ధర్మం అక్కరలేదు. పీడితులు మాత్రం ధర్మం వైపు నిలబడాల్సి ఉందన్న విషయం అంబేద్కర్ గ్రహించారు. ఆరోజుల్లో మహిళలకు గుర్తింపు లేదు. వైదిక మతం ప్రకారం మహిళలంతా శూద్రులే. వారికి స్వేచ్ఛ లేదు. విద్యలేదు. సమాజంలో గుర్తింపూ, గౌరవం లేదు. సతీ సహగమనం మాత్రం ఉంది. నాగ్‌పూర్‌లో ఆరెస్సెస్ వారి ప్రధాన కార్యాలయం ఉంది. వారి ప్రభావం తగ్గించడానికి అంబేద్కర్ ధమ్మ దీక్ష అక్కడ తీసుకున్నారని కొందరు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆరెస్సెస్ అనే సంస్థ అసలు తన దృష్టిలోనే లేదని, తను నాగ్‌పూర్‌ను ఎన్నుకోవడానికి బలమైన కారణాలు చాలా ఉన్నాయని చెప్పారు. నాగ్‌పూర్ పట్టణానికి ఆ పేరు ఎందుకొచ్చిందంటే అది నాగజాతికి చెందిన ఆదివాసులకు నిలయం. వారంతా బుద్ధుని అనుయాయులు. ఒకప్పుడు వీరే బుద్ధుడికి రక్షణగా ఉన్నారు. ఈ నాగజాతి ఆర్యుల ఆగడాలకు బలైపోయిన జాతి. అక్కడ నాగ నది కూడా ఉంది. వీటన్నింటి కారణంగా తను బౌద్ధం స్వీకరించడానికి ఈ పట్టణాన్ని ఎన్నుకున్నానని అంబేద్కర్ వివరణ ఇచ్చారు. ఆ రోజుల్లో లోకమాన్య బాలగంగాధర్ తిలక్ 'కేసరి' అనే పత్రిక వెలువరించేవారు. ఈయన అంబేద్కర్‌ను విమర్శిస్తూ వ్యాసాలు ప్రకటించేవారు. పేదలైన అస్పృశ్యులను అంబేద్కర్ తప్పుదారి పట్టిస్తున్నారనీ, వారిని బౌద్ధంలోకి తీసుకుపోవడం అన్యాయమనీ రాసేవారు. మృత కళేబరాలు తొలగించడం వల్ల మెహర్ (మాల- మాదిగ) లకు రూ.500/- ఆదాయం లభిస్తోంది కదా? అది లేకుండా అంబేద్కర్ వారి నోట్లో మట్టి కొడుతున్నాడని విమర్శించారు. అంతేకాదు, రిజర్వేషన్‌తో వచ్చే యం.ఎల్.ఎ/ యం.పి సీట్లు పోతాయి కదా? దళితుల అవకాశాలకు అంబేద్కర్ గండి కొడుతున్నాడని తిలక్ అతని సహచరులు ఆక్రోశించారు. అంబేద్కర్ అందుకు చెంపపెట్టు లాంటి సమాధానం ఇచ్చారు. బ్రాహ్మణులు మెహర్లుగా మారి, జంతు మృత కళేబరాలు తొలగిస్తూ, దానిమీద వచ్చే ఆదాయం వారు తీసుకోవచ్చు కదా? ఎందుకంత ఉక్రోషం? అని ప్రశ్నించారు. దళితుల రిజర్వేషన్ స్థానాల్లో కూడా అసెంబ్లీకి, పార్లమెంట్‌కు అగ్రవర్ణం వారే పోటీచేసి గెలుచుకోవచ్చు కదా? అందులో ఉన్న ఇబ్బంది ఏమిటీ?- అని ప్రశ్నించారు. అసలు విషయం ఏమిటంటే సమానత్వానికి అగ్రవర్ణం వారు అంగీకరించకపోవడమే! అధిక సంఖ్యాకులైన శూద్రులు, దళితులు తమకు బానిసలుగా పడి ఉండాలని వారు కోరుకోవడమే. ఆ పరిస్థితి మారిపోతూ ఉందంటే వారు భరించలేరు కదా? అధిక సంఖ్యాకులైన బహుజనులు తమ గుప్పిట్లోంచి ఎగిరిపోతున్నారని బెంబేలు పడిపోయారు. హిందూత్వవాది అయిన తిలక్ బాధ కూడా అదే-తమిళ బౌద్ధ ఉద్యమకారుడు పండిత అయోతీథాస్ అంబేద్కర్ బౌద్ధం స్వీకరించక ముందే ఒక మాట చెప్పారు. పీడిత కులస్తులంతా అస్థిత్వ పోరాటాలు చేయాలేగాని, కాందిశీకుల్లాగా అగ్ర కులాలను అనుకరించగూడదని వారించాడు. అలాగే మన తెలుగువాడు, ఫిజిక్స్ ప్రొఫెసర్, నవ బౌద్ధుడూ అయిన లక్ష్మీ నరసు రాసిన 'ఎసెన్స్ ఆఫ్ బుద్ధిజమ్' గ్రంథ ప్రభావం అంబేద్కర్‌పై బాగా పడిందని చెపుతారు. ఎందుకంటే 1948 లో అంబేద్కర్ ఆ పుస్తకానికి ముందుమాట రాసి, తనే స్వయంగా బొంబాయిలో మలి ముద్రణ వేయించారు. ఇవన్నీ ఒక్కొక్కటిగా అంబేద్కర్ బౌద్ధం వైపు ఆకర్షించడానికి కారణాలయ్యాయి. వైదిక ధర్మం అసమానతలపై ఆధారపడి ఉంటే, బౌద్ధం సమానత్వంపై ఆధారపడి ఉంది. అందుకే అది ప్రపంచంలోని 128 దేశాలకు వ్యాపించింది. బుద్ధుడు చెప్పిన కార్యకారణ సంబంధంలో నుంచే ప్రపంచ వైజ్ఞానిక పరిశోధనలు సాగాయి. బుద్ధుడి బోధనలు లేకపోతే గాంధీ అహింసా సిద్ధాంతం ఉండేది కాదు. పండిట్ నెహ్రూ పంచశీల ఉండేది కాదు. కొంచెం లోతుగా ఆలోచిస్తే అన్నింటిలో బౌద్ధం మూలాలు కనిపిస్తాయి. అశోక చక్రమైనా, సారనాథ్ స్థూపమైనా, దేశ వ్యాప్తంగా ఊరూరా ఎన్నో బౌద్ధ చిహ్నాలు కనిపిస్తున్నాయి. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్, దర్బార్ హాలులో నిలువెత్తు బౌద్ధ విగ్రహం ఉంది. దాని ముందే కేంద్ర మంత్రులంతా ప్రమాణ స్వీకారం చేస్తారు. భారతరత్న, పద్మశ్రీ వంటి బిరుదులు ఇచ్చేదీ అక్కడే. అక్కడి బుద్ధ విగ్రహం పాదాలు ఏ ఎత్తులో ఉన్నాయో- రాష్ట్రపతి భవన్‌కి కింద కి.మీ దూరంలో ఉన్న ఇండియా గేట్ పైభాగం అంతే ఎత్తులో ఉంటుంది. మన దేశంలోని రాజ్యాంగాన్ని వ్యవస్థలూ ప్రజలూ సరిగా పాటిస్తే- ఇప్పటికీ మన దేశం బౌద్ధ దేశంగానే కొనసాగుతూ ఉండేది. మానవ హక్కులు, ఆత్మగౌరవం బౌద్ధంలో దక్కుతాయి. అది దైవ భావన మీద, అసమానతల మీద, ఆధారపడిలేదు. బౌద్ధం స్వీకరించడానికి డా.బి.ఆర్.అంబేద్కర్ నాగ్‌పూర్‌లో రామ్‌దాస్ పేట్ ప్రాంతాన్ని ఎన్నుకున్నారు. ప్రస్తుతం అది నాగ్‌పూర్‌లోని అభయంకర్ నగర్‌లో ఉంది. ధమ్మ దీక్ష తీసుకున్న తర్వాత ఒక నెల పదిహేనురోజులకు అంబేద్కర్ మరణించారు. (6 డిసెంబర్ 1956) ఆయన మరణం తర్వాత ఇరవై మిలియన్ల మంది మార్చి 1959లో బౌద్ధం స్వీకరించారు. అంబేద్కర్ స్మారక సమితి ఏర్పడి నాలుగు ఎకరాలలో అక్కడ ఒక స్థూపం నిర్మించారు. గొప్ప బౌద్ధ దర్శనీయ స్థలంగా తీర్చిదిద్దారు.

సుప్రసిద్ధ సాహితీవేత్త, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్

విశాలాంధ్ర

ఆదివారం
20 అక్టోబరు 2024

నీటిపై తేలియాడే సోలార్ ప్లాంట్

చెన్నై: రాష్ట్రంలోనే తొలిసారిగా కోయంబత్తూరులో చెరువుపై తేలియాడే సోలార్ ప్యానెళ్లతో విద్యుత్ ఉత్పత్తి చేసే పనులు చురుగ్గా సాగుతున్నాయి. నమక్కునామే పథకం కింద రూ.1.45 కోట్లతో జర్మన్‌కు చెందిన సంస్థతో కలిసి కోయంబత్తూరు కార్పొరేషన్ ఈ ప్రాజెక్టు చేపట్టింది. ఆ నగరంలోని ఉక్కడం పెరియకుళం చెరువులో అర ఎకరా విస్తీర్ణంలో సోలార్‌ప్యానెళ్లను లంగరు వేసే పద్ధతి (ఆంకరింగ్ మెథడ్)లో తేలియాడేలా అమర్చారు. ఆ సోలర్ ప్యానెళ్లకు ఎలాంటి ముప్పువాటిల్లకుండా ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. 24 గంటల కాపలాకు సిబ్బందిని నియమించారు. ఈ సోలార్ ప్యానెళ్ల ద్వారా రోజూ 154 కేవీ విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని కోయంబత్తూరు కార్పొరేషన్ అధికారులు తెలిపారు. మరో రెండు నెలల్లోగా అన్ని పనులు పూర్తయిన తర్వాత విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

జలదిగ్బంధంలోనే చెన్నై శివారు ప్రాంతాలు

చెన్నై: కుండపోత వర్షం ఆగి మూడు రోజులు దాటినా శివారు ప్రాంతాల్లో వారంతా ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నారు. కార్పొరేషన్ అధికారుల సమాచారం మేరకు శివారు ప్రాంతాల్లో సుమారు 500 కుటుంబాలు వాననీటిలోనే కాపురం చేస్తున్నారు. నగర శివారు ప్రాంతాలైన చోళవరం, రెడ్‌హిల్స్, వేళచ్చేరి, ఆవడి, తాంబరం, ముడిచ్చూరు, ముగిలివాక్కం తదితర ప్రాంతాల్లో ఇళ్లచుట్టూ చేరిన నీటిలోనే అవస్థలు పడుతున్నారు. రెడ్‌హిల్స్ సమీపం కుమరన్ నగర్ ప్రాంతాల్లో నివసిస్తున్నవారిని అగ్నిమాపక సిబ్బంది రబ్బరు పడవల్లో తరలిస్తున్నారు. శ్రీరామ్‌నగర్, మీనాక్షి నగర్, సన్‌సిటీ మహామేరు నగర్, పాడియనల్లూరు, సెంథిల్‌వేలన్ నగర్ మధురవాయల్, వానగరం, అంబత్తూరు పారిశ్రామిక వాడ, తాంబరం సమీపం ముడిచ్చూరు ప్రాంతాల్లోనూ మూడు రోజులుగా నీటిలోనే స్థానికులు ఇక్కట్లు పడుతున్నారు. వాహనాల రాకపోకలు కూడా నిలిపివేశారు. దీంతో నిత్యావసర సరకుల కోసం స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం కార్పొరేషన్ కార్మికులు ఈ ప్రాంతాల్లో దోమలబెడద నివారించేం దుకు ఫాగింగ్ చేస్తున్నారు.

ప్రశాంత్ కిశోర్ పార్టీ సమావేశంలో కుమ్ములాటలు

గయ: బీహార్‌లోని గయలో జన్ సూరజ్ పార్టీ సమావేశంలో కుమ్ములాటలు చోటుచేసుకున్నాయి. పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ పిలుపు మేరకు సమావేశానికి హాజరైన నేతలు, కార్యకర్తలు గలాటా సృష్టించారు. బీహార్ అసెంబ్లీ ఉప ఎన్నికలకు అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ఏర్పాటు చేసిన పార్టీ సమావేశం రసాభాసగా మారింది. గయలోని బెలగంజ్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ముస్లిం అభ్యర్థికి టికెట్ ఇవ్వాలనుకుంటున్నట్లు పీకే గతంలో ప్రకటించారు. అయితే తాజాగా జరిగిన ఈ సమావేశంలో ఈ స్థానానికి టికెట్ ఆశిస్తున్న ఇద్దరు అభ్యర్థుల మద్దతుదారులు తొలుత తమ నేతలకు మద్దతుగా నినాదాలు చేశారు. దీనిని గమనించిన ప్రశాంత్ కిషోర్ స్టేజి మీద నుంచి వారిని వారించారు. అయితే ప్రశాంత్ కిశోర్ మాటలను అక్కడున్నవారెవరూ పట్టించుకోలేదు. పైగా కుర్చీలు విసురుకుంటూ ఎవరికి దొరికిన దాన్ని వారు ధ్వంసం చేశారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ప్రశాంత్ కిశోర్ సమావేశం మధ్యంలోనే బయటకు వెళ్లిపోయారు. దీనికి ముందు తొలుత బెలగంజ్ ఉప ఎన్నిక కోసం నాలుగు పేర్లను ప్రతిపాదించారు. వీరిలో అమ్జద్ హసన్, ప్రొ. ఖిలాఫత్ హుస్సేన్, దానిష్ ముఖియా, ప్రొ. సర్ఫరాజ్ ఖాన్‌లున్నారు. ఈ సమావేశంలో, అమ్జద్ హసన్‌కు మద్దతు పలుకుతూ దానిష్ ముఖియా తన పేరును ఉపసంహరించుకున్నాడు. సర్ఫరాజ్ ఖాన్ తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని తెలిపారు. దీంతో అమ్జద్ హసన్, ఖిలాఫత్ హుస్సేన్‌ల పేర్లు చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ బెలగంజ్ టికెట్‌ను ఖిలాఫత్ హుస్సేన్‌కు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మాట వినగానే అమ్జద్ హసన్, ఖిలాఫత్ హుస్సేన్‌ల మద్దతుదారులు కుమ్మటాటకు దిగారు.

'మా కొద్దీ గడ్డం బూచోళ్లు'

రోడ్డెక్కిన కాలేజీ అమ్మాయిలు

భోపాల్: ఎలాంటి భర్త కావాలి లేదా ఎలాంటి భార్య కావాలి అని పెళ్లికెదిగిన పిల్లల్ని తల్లిదండ్రులు అడగడం సర్వసాధారణం. నాకు ఎరుపుగా... అందంగా ఉన్న అమ్మాయి కావాలి అని అబ్బాయిలు, ఆరడుగులుంటాడా... జీతం లక్షల్లో ఉందా అని అమ్మాయిలు ఆశపడటం సహజం. కానీ ఇప్పుడు ట్రెండ్‌మారింది అంటున్నారు ఇండోర్ యువతులు. ఏకంగా 'మాకొద్దీ గడ్డం బూచోళ్లు', 'నో క్లీన్ షేవ్... నో గర్ల్‌ఫ్రెండ్' అంటూ రోడ్డుమీద కొచ్చారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడమే కాదు. ఫ్యాషన్‌గా గెడ్డం పెంచుకుంటున్న పెళ్లి కాని యువకుల గుండెల్లో బాంబు పేల్చింది. ఇండోర్‌లో కొందరు కాలేజీ యువతులు 'గడ్డం తొలిగించండి... ప్రేమను కాపాడండి' అనే నినాదంతో ర్యాలీ చేశారు. ముఖాలకు గడ్డం మేకప్ వేసుకొని మరీ అబ్బాయిల గడ్డం విషయమై ర్యాలీ తీయడం హాట్ టాపిక్‌గా మారింది. 'గడ్డం రఖో యా జీఎఫ్ రఖో' (గడ్డం కావాలా... గర్ల్‌ఫ్రెండ్ కావాలా), 'గడ్డం హటావో ప్యార్ బచావో' నినాదాలతో వీధుల్లోకి వచ్చారు. 'నో క్లీన్ షేవ్... నో లవ్', 'నో క్లీన్ షేవ్... నో గర్ల్‌ఫ్రెండ్' అనే ప్లకార్డులతో చేపట్టిన ర్యాలీ సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. ఈ వీడియోను ఓ 'ఎక్స్' (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. దీనిపై నెటిజన్లు తమదైన శైలిలో ఫన్నీగా స్పందిస్తున్నారు. వారి డిమాండ్ కరెక్టేగా, కనీసం వారానికి ఒకసారైనా క్లీన్ షేవ్ కాకున్నా కనీసం ట్రీమ్ చేసుకుంటే బాగుంటుంది. అప్పుడే మనం ఎలుగుబంటిలా కాకుండా జెంటిల్‌మెన్‌లా ఉంటాం అంటూ కామెంట్ చేయడం విశేషం. మరికొందరు దీని వెనుకున్న మతలబు ఏంటి భయ్యా అంటూ దీర్ఘాలోచనలో పడిపోయారు. కాగా పురుషులు గడ్డాలతో అందంగా కనిపిస్తారా లేదా గడ్డం లేకపోతే అందంగా కనిపిస్తారా అనేది పెద్ద చర్చే. గడ్డాలున్న పురుషులనే మహిళలు ఇష్టపడతారని అనేక అధ్యయనాలు చెబుతున్నప్పటికీ, క్లీన్ షేవ్ మెన్ మరింత ఆకర్షణీయంగా ఉంటారని మరికొందరి వాదన.

పర్యాటకరంగ అభివృద్ధితో కొత్త ఉద్యోగాలు: గడ్కరీ

పనాజి: కొత్త ఎక్స్‌ప్రెస్‌వేలు, పర్యాటక ప్రదేశాలలో మౌలిక సదుపాయాలు పెంచితే... పర్యాటక రంగం అభివృద్ధి చెందడం ద్వారా ద్వారా కొత్త ఉద్యోగాలు లభిస్తాయని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి 'నితిన్ గడ్కరీ' పేర్కొన్నారు. గోవాలో ఫెడరేషన్ ఆఫ్ హెూటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన సదస్సులో గడ్కరీ ఈ విషయాలను వెల్లడించారు. ఆర్థికాభివృద్ధికి ఆతిథ్య రంగం ఎంతో కీలకమని నితిన్ గడ్కరీ సూచించారు. వ్యాపార కార్యకలాపాలను ఎప్పటికప్పుడు మెరుగుపరచాలన్న మంత్రి... అతిథ్య రంగానికి తమ బలమైన మద్దతును వ్యక్తం ప్రకటించారు. ఇది విస్తారమైన ఉద్యోగ అవకాశాలను అందిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పుడున్నవాటితో పాటు మరో 18 పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తోంది. ఈ ప్రాజెక్టులు త్వరలోనే పూర్తవుతాయి. ఇది పర్యాటకాన్ని మరింత మెరుగుపరుస్తుందని గడ్కరీ పేర్కొన్నారు. ప్రస్తుతం చాలామంది ప్రజలు పుణ్యక్షేత్రాలను సందర్శించడానికి సుముఖత చూపిస్తున్నారని ఆయన అన్నారు.

జూనియర్ వైద్యుల నిరసనలు ఉధృతం

కోల్‌కతా: ఆర్జీకర్ వైద్య కళాశాల ఆస్పత్రి జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనపై వైద్యులు చేపట్టిన నిరసన మరింత ఉధృతమైంది. శనివారం నగరం అంతటా జూనియర్ వైద్యుల ప్రదర్శన, నిరసనలు హెూరెత్తాయి. కాగా శనివారం రాత్రి 8 గంటల నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు రాత్రంతా నిరసన చేపట్టేందుకు 8బి బస్టాండ్ సమీపంలోని జాదవ్‌పూర్ వీధుల్లో నిరసనకారులు సిద్ధమయ్యారు. తూర్పు బెంగాల్, మోహన్ బగాన్ రెండు ఫుట్‌బాల్ జట్ల అభిమానులు మానవహారానికి పిలుపునిచ్చారు. ఇది సాల్ట్ లేక్ స్టేడియంలో ఇండియన్ సూపర్ లీగ్ డెర్బీకి ముందు ఉల్తాదంగా నుంచి కడపరా వరకు అలాగే రూబీ క్రాసింగ్ నుంచి బిల్డింగ్ మోర్ వరకు స్టేడియం చుట్టూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు జరగనుంది. కాగా హత్యాచార ఘటనపై ఆగస్టు 9 నుంచి చేపట్టిన నిరసనలకు 70 రోజులు పూర్తి కావడంతో ఆందోళన ఉధృతం చేసేందుకు వైద్యులు పూనుకున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు నగరానికి 17 కిలోమీటర్ల దూరంలోని పానిహతిలోని సోదేపూర్ నుంచి వైద్యుల ర్యాలీ ప్రారంభమవుతుంది. రాత్రి 9:30 గంటలకు ఎస్ప్లానేడ్ వద్ద వైద్యులు నిరాహార దీక్ష చేస్తున్న డోరినా క్రాసింగ్ వద్ద ముగిసే ముందు ఇది అనేక ప్రదేశాల గుండా వెళుతుంది. తాము ఎక్కువ ప్రాంతాల గుండా నిరసనలు నిర్వహించడానికి ఈ మార్గాన్ని నిర్ణయించామని కోల్‌కతా వైద్య కళాశాల ఆస్పత్రిలో రెండవ సంవత్సరం పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రయినీ విద్యార్థి అగ్నిదీప్త ముఖర్జీ ఒక ఆంగ్ల వార్తా సంస్థతో అన్నారు. 'మేము ఎక్కువ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలను ఆందోళనలో భాగస్వామ్యులను చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. డబ్ల్యూబీజేడీఎఫ్ (పశ్చిమ బెంగాల్ జూనియర్ డాక్టర్స్ ఫ్రంట్) నుంచి మా ప్రతినిధులు సామూహిక నిరసనకు ప్రజలను చేర్చడానికి వివిధ ప్రాంతాలలో ఉంటారు. సాధారణ ప్రజల నుంచి మాకు భారీ మద్దతు లభించింది. తద్వారా మరో అభయ జరగదు. ఇప్పుడు ఇది వైద్యుల ఉద్యమం మాత్రమే కాదు... ప్రపంచవ్యాప్త నిరసన. మేము అమెరికా, కెనడా నుంచి నిరసన వీడియోలను అందుకున్నాం. మా డిమాండ్లు చెల్లుబాటు అయ్యేవని వారు అర్థం చేసుకున్నందున ప్రతి ఒక్కరూ మాకు మద్దతు ఇస్తున్నారు' అని ఆమె తెలిపారు. కాగా కోల్‌కతాలో వర్షం ఉన్నప్పటికీ నిరాహార దీక్ష స్థలంలో ర్యాలీకి వైద్యులు సిద్ధమవుతున్నారు. నిరాహార దీక్షలో ఉన్న జూనియర్ వైద్యుల ఆరోగ్యం ఇప్పటికే క్షీణించింది. 'నేటి ర్యాలీ తర్వాత మేము రేపు మాస్ కన్వెన్షన్ చేస్తాం. అందులో మాతో చేరమని మేము ప్రజలను ఆహ్వానిస్తాం' అని మరో జూనియర్ డాక్టర్ చెప్పారు. 'మా డిమాండ్లను నెరవేర్చకుంటే మా సదస్సులో మా రాబోయే సామూహిక కార్యక్రమాలను ప్రకటిస్తాం. సోమవారం కూడా కొన్ని కార్యక్రమాలను ప్రకటిస్తాం. మంగళవారం లోపు, మా డిమాండ్లను ఆమోదించకపోతే, మేము మొత్తం ఆరోగ్య వ్యవస్థను స్తంభింప చేస్తాం. అయితే, ఇది ప్రభుత్వ ప్రతిస్పందనపై ఆధారపడి ఉంటుంది' అని తెలిపారు.

దీక్షా శిబిరాన్ని సందర్శించిన ప్రభుత్వ ప్రతినిధులు

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్, హోం శాఖ కార్యదర్శి నందిని చక్రవర్తి శనివారం జూనియర్ వైద్యులు ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న నిరసన స్థలాన్ని సందర్శించారు. ఇప్పటి వరకు నిరాహార దీక్ష చేస్తున్న ఆరుగురు వైద్యుల ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆస్పత్రి పాలయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు 21లోగా నిర్మాణాత్మకంగా వ్యవహరించి ప్రతిష్టంభనను తొలగించాలని డిమాండ్ చేస్తూ ప్రస్తుతం ఎస్ప్లానేడ్ ప్రాంతంలో ఎనిమిది మంది వైద్యులు నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్నారు. సోమవారంలోగా తమ డిమాండ్లను నెరవేర్చకుంటే అక్టోబరు 22న రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగుతామని వైద్యాధికారి ఒకరు తెలిపారు. 'ముఖ్యమంత్రి (మమతా బెనర్జీ) చర్చకు కూర్చుని మా డిమాండ్లన్నింటినీ అమలు చేయాలని మేము కోరుకుంటున్నాం' అని అన్నారు. నిరసన తెలుపుతున్న వైద్యులకు సంఘీభావం తెలిపేందుకు అనేక మంది రంగస్థల ప్రముఖులు శనివారం లాంఛనంగా నిరాహార దీక్ష చేపట్టారు. ఆరోగ్య శాఖ కార్యదర్శి ఎన్.ఎస్.నిగమ్‌ను తొలగించాలన్న డిమాండ్‌తో పాటు ఆందోళన చేస్తున్న వైద్యులు ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించాలని నిర్ణయించారు.

రేపు జూనియర్ వైద్యులను కలుస్తా: సీఎం మమతా బెనర్జీ

జూనియర్ వైద్యులు తమ ఆమరణ నిరాహార దీక్షను విరమించుకోవాలని బెంగాల్ సీఎం మమతా బెనర్జీ విజ్ఞప్తి చేశారు. వారి డిమాండ్లపై మరింత లోతుగా చర్చించేందుకు సోమవారం వారిని కలుస్తానని శనివారం తెలిపారు. జూనియర్ వైద్యులు ధర్మతలాలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ప్రదేశాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్ శనివారం మధ్యాహ్నం సందర్శించినప్పుడు సీఎం మమతా బెనర్జీ వారితో ఫోన్‌లో మాట్లాడారు. 'ప్రతి ఒక్కరికి నిరసన తెలిపే హక్కు ఉంది. కానీ అది ఆరోగ్య సేవలను ప్రభావితం చేయకూడదు. ఆందోళనను ఉపసంహరించుకోవాలి' అని ఆమె వైద్యులను కోరారు. 'మీ డిమాండ్లలో చాలా వరకు నెరవేర్చాం. మిగిలిన డిమాండ్లను నెరవేర్చడానికి నాకు మూడు నుంచి నాలుగు నెలల సమయం ఇవ్వండి' అని కోరారు. ఈ సందర్భంగా బెనర్జీ వైద్యుల డిమాండ్లతో విభేదించలేదని, ప్రభుత్వంతో చర్చలకు కూర్చోవాలని వారిని అభ్యర్థించారు. 'దయచేసి ఆందోళన విరమించండి. కొన్ని డిమాండ్లకు విధానపరమైన నిర్ణయాలు అవసరం. మేము పూర్తి స్థాయిలో సహకరిస్తాం. కానీ ఏమి చేయాలో మీరు ప్రభుత్వానికి నిర్దేశించడం ఆమోదయోగ్యం కాదు' అని ఆమె అన్నారు.

పన్నూ హత్యకు కుట్ర కేసు...

'రా' మాజీ అధికారిపై అభియోగాలు

న్యూఢిల్లీ: సిక్కు వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్యకు కుట్ర జరిగిందన్న ఆరోపణలపై అమెరికా దర్యాప్తు జరుపుతోంది. ఇందులో భాగంగా భారత మాజీ ఇంటెలిజెన్స్ అధికారి వికాస్ యాదవ్‌పై ఇటీవల అభియోగాలు నమోదవ్వడం చర్చనీయాంశమైంది. వికాస్ పరారీలో ఉన్నట్లు అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ నోటీసులు జారీ చేసింది. ఈ తరుణంలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఆ అధికారిని ఢిల్లీ పోలీసులు గతేడాది ఓ కిడ్నాప్, దోపిడీ కేసులో అరెస్టు చేసినట్లు జాతీయ మీడియాల్లో కథనాలు వెల్లడించాయి. ఢిల్లీలోని రోహిణీ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి గతేడాది డిసెంబరులో వికాస్ యాదవ్‌పై ఫిర్యాదు చేశాడు. వికాస్‌తో తనకు 2023 నవంబరులో పరిచయం ఏర్పడిందని, కొంతకాలం పాటు టచ్‌లో ఉన్నామని చెప్పారు. అయితే, గతేదాది డిసెంబరులో ఓ హోటల్‌కు పిలిచి తనపై దాడి చేసి దోపిడీకి యత్నించాడని పేర్కొన్నారు. దీంతో గతేదాది డిసెంబరు 18న వికాస్, అతడి అనుచరుడిని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. దీనిపై ఈ ఏడాది మార్చిలో ఛార్జ్‌షీట్ దాఖలు చేయగా... ఆ మరుసటి నెలలోనే వికాస్‌కు బెయిల్ మంజూరైనట్లు తెలుస్తోంది. పన్నూ హత్యకు కుట్ర కేసులో అతడిపై అభియోగాలు నమోదైన వేళ.. ఈ వార్తలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కుట్ర కేసుకు సంబంధించి న్యూయార్క్‌లోని కోర్టులో న్యాయశాఖ ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. అందులో భారత పౌరుడైన వికాస్‌యాదవ్ (39)పై మనీలాండరింగ్, కుట్రకు వ్యక్తులను నియమించడం, పన్నూ హత్యకు ప్రణాళిక రచించడం వంటి అభియోగాలు మోపారు. ప్రస్తుతం ఆయన ఆచూకీ తెలియరావడం లేదని అందులో పేర్కొన్నారు. వికాస్ గతంలో భారత ప్రభుత్వ అధికారిగా విధులు నిర్వహించారు. భారత విదేశీ ఇంటెలిజెన్స్ విభాగం, రా విభాగాన్ని నిర్వహించే కేబినెట్ సెక్రటేరియట్‌లో ఉద్యోగిగా పనిచేశారు. అమెరికా గడ్డపై పన్నూ హత్యకు కుట్ర జరిగిందని, దాన్ని తాము భగ్నం చేశామని అగ్రరాజ్యం గతేడాది ఆరోపించిన సంగతి తెలిసిందే. భారత ప్రభుత్వ ఉద్యోగితో కలిసి పన్నూను హత్య చేసేందుకు నిఖిల్ గుప్తా కుట్ర పన్నారని అమెరికా ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఇప్పటికే చెక్ రిపబ్లిక్ జైలులో ఉన్న నిఖిల్‌ను అమెరికాకు అప్పగించినట్లు ఆ మధ్య మీడియా కథనాలు వెల్లడించాయి. అటు ఈ కేసు వ్యవహారంపై అమెరికా కోర్టు భారత ప్రభుత్వానికి సమన్లు కూడా జారీ చేసింది.

అయితే, ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన భారత్... దీనిపై విచారణ జరిపేందుకు స్వదేశంలో ఓ దర్యాప్తు కమిటీని ఏర్పాటుచేసింది. ఈ క్రమంలోనే ఇటీవల భారత అధికారుల బృందం అమెరికాలోని విదేశాంగ శాఖ, న్యాయశాఖ అధికారులతో సమావేశమైంది. ఈ అభియోగాల్లో పేర్కొన్న భారత అధికారి ప్రస్తుతం ప్రభుత్వంలో పనిచేయడం లేదని ఢిల్లీ అధికారులు తమకు వెల్లడించినట్లు అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మాథ్యూ మిల్లర్ తెలిపారు. ఈ బృందం పర్యటన ముగిసిన తర్వాతే వికాస్ యాదవ్‌పై అగ్రరాజ్యం అభియోగాలు చేసింది.

కిషన్ జీ భార్య అరెస్ట్ కాలేదు

మావోయిస్టుల ప్రకటన

రాయ్‌పూర్ (చత్తీస్‌గఢ్): మావోయిస్టు పార్టీ అగ్రనేత మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్ జీ భార్య సుజాత అలియాస్ మైనా బాయి అరెస్ట్ కాలేదని మావోయిస్ట్ పార్టీ ప్రకటించింది. మావోయిస్టు ఉద్యమాన్ని నీరుగార్చేందుకు బూటకపు ప్రచారం చేస్తుందంటూ ప్రభుత్వంపై మండిపడింది. కేంద్రంలోని ఫాసిస్ట్ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో సామూహిక హత్యలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ శనివారం ఓ లేఖ విడుదల చేసింది. మావోయిస్ట్ రహిత భారతం అంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా డెడ్ లైన్ పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అమాయక ఆదివాసీలను హత్య చేసి... ఆ శవాలకు గెరిల్లా యూనిఫాం వేస్తున్నారని ఆరోపించింది. ఫాసిస్ట్‌లకు హిట్లర్ గతే పడుతుందని స్పష్టం చేసింది. అంతిమంగా ప్రజలే విజయం సాధిస్తారని చరిత్ర రుజువు చేస్తుందని మావోయిస్టు పార్టీ వివరించింది. దండ కారణ్యంలో సాగుతున్న కార్పొరేట్ పాశవిక... ఆపరేషన్ కగార్ తక్షణం నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. దక్షిణ సబ్ జోనల్ బ్యూరో కమిటీ నాయకురాలు సమత పేరుతో ఈ లేఖను మావోయిస్టు పార్టీ విడుదల చేసింది. దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రంలోని మోదీ సర్కార్ 2026, మార్చి నాటికి భారత్‌ను మావోయిస్టు రహిత దేశంగా మార్చేందుకు సన్నాహాలు చేస్తుంది. ఆ క్రమంలో ఆపరేషన్ కగార్‌కు శ్రీకారం చుట్టింది. అందులోభాగంగా మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాలపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో మావోయిస్టులకు షెల్టర్ జోన్‌గా ఉన్న దండకారణ్యంలో తనిఖీలను ముమ్మరం చేసింది. దీంతో ఈ నెల నాల్గవ తేదీన... దంతెవాడ, నారాయణపూర్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 38 మంది మావోయిస్టులు మరణించారు. అయితే పోలీసులు మాత్రం 31 మంది వివరాలను మాత్రమే వెల్లడించారు. ఈ ఎన్‌కౌంటర్‌పై మావోయిస్టు పార్టీ స్పందించింది. అగ్రనేతలు ఎవరు మరణించ లేదని స్పష్టం చేసింది. ఈ ఘటన జరిగిన వారం రోజులకు మావోయిస్ట్ అగ్రనేత కిషన్ జీ భార్య సుజాత అలియాస్ మైనా బాయిను తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేశారంటూ మీడియాలో వార్తలు వెల్లువెత్తాయి. వైద్య చికిత్స కోసం చత్తీస్‌గఢ్ నుంచి ఉమ్మడి భద్రచలం మీదగా హైదరాబాద్ వెళుతుండగా ఆమెను అరెస్ట్ చేసినట్లు ప్రచారం. కిషన్ జీ భార్యను అరెస్ట్ చేస్తే... వెంటనే కోర్టులో ప్రవేశపెట్టాలని పౌర హక్కుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. అలాంటి వేళ.. సుజాత అరెస్ట్‌పై మావోయిస్టు పార్టీ క్లారిటీ ఇచ్చింది. ఆమె అరెస్ట్ కాలేదని స్పష్టం చేసింది. పార్టీని నిర్వీర్యం చేసేందుకే ఈ తరహా ఎత్తుగడలు వేస్తుందని మావోయిస్టు పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వం కొలువు తీరిన కొద్ది రోజులకే.. సుజాత భర్త మావోయిస్టు అగ్రనేత మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్ జీ ఎన్‌కౌంటర్‌లో మరణించిన సంగతి తెలిసిందే.

మహారాష్ట్ర ఎన్నికలు దేశ భవిష్యత్ మార్చగలవు

అఖిలేశ్ యాదవ్

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర భవిష్యత్తును మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తును కూడా నిర్ణయిస్తాయని సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. మహారాష్ట్రలో నవంబరు 20న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రతిపక్ష 'మహా వికాస్ అఘాడీ' సీట్ల పంపకంలో భాగంగా తమ పార్టీకి 12 స్థానాలు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. తమకు బలమున్న కొన్ని స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించామని తెలిపారు. ధూలే నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా ఇర్షాద్ జహాగీర్దార్‌ను ప్రకటిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ధూలేలో ఏర్పాటు చేసిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తూ ... బీజేపీ రాష్ట్రంలో పార్టీలను విభజించి... అధికారాన్ని దొంగిలించిందని అఖిలేశ్ ధ్వజమెత్తారు. 'మహారాష్ట్ర ఎన్నికలు దేశ రాజకీయాలను మార్చగలవు. ఇవి చారిత్రకమైనవి. ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఉండదు. ఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వం కూడా కూలిపోతుంది. అన్ని విషయాలకు బుల్డోజర్లను పంపే ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మళ్లీ అధికారంలోకి వచ్చే అవకాశం లేదు' అని అఖిలేశ్ జోస్యం చెప్పారు. మహాయుతి ప్రభుత్వం ఇక్కడి పరిశ్రమలను గుజరాత్‌కు తరలిస్తోందని ఆరోపించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల -2024 షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల ప్రకటించింది. రాష్ట్రంలో ఒకే దశలో నవంబరు 20న పోలింగ్ జరగనుండగా 23న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు వెల్లడించింది.

మళ్లీ విధుల్లోకి రిటైర్డ్ ఉద్యోగులు!

రైల్వే శాఖ కీలక నిర్ణయం

న్యూఢిల్లీ: సిబ్బంది కొరతను అధిగమించేందుకు రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా వివిధ జోన్లలో 25వేల ఉద్యోగాలకు రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను ప్రారంభించింది. అయితే, వీటికి దరఖాస్తు చేసుకునేందుకు రిటైర్డ్ రైల్వే ఉద్యోగులకు కూడా అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అధికారిక వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ కొత్త నిబంధన కింద.. సూపర్‌వైజర్ల నుంచి ట్రాక్‌మెన్ వరకు వివిధ ఉద్యోగాలకు రైల్వే నుంచి రిటైర్ అయిన ఉద్యోగులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే, 65 ఏళ్ల లోపు వారు మాత్రమే ఇందుకు అర్హులని చెప్పినట్లు సమాచారం. రెండేళ్ల పదవీకాలానికి గానూ వీరిని నియమించుకోనున్నారు. అవసరమైతే పదవీకాలాన్ని పొడిగించే అవకాశాలున్నట్లు సమాచారం. ఇందుకోసం ఇప్పటికే అన్ని జోనల్ రైల్వే జనరల్ మేనేజర్లకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుస్తోంది. రిటైర్డ్ ఉద్యోగులు గత ఐదేళ్ల మెడికల్ ఫిట్‌నెస్‌తో పాటు, పదవీ విరమణకు ముందు ఉద్యోగంలో ఉన్నప్పుడు వారి పనితీరును పరిశీలించి ఈ నియామకాలు చేపట్టనున్నారు. గతంలో విజిలెన్స్, లేదా డిపార్ట్‌మెంట్ చర్యలను ఎదుర్కొన్న వారు దరఖాస్తులకు అనర్హులని తేల్చినట్లు సమాచారం. ఇలా నియమించుకున్న వారికి.. చివరిసారిగా వారు పొందిన నెలవారీ వేతనంలో నుంచి బేసిక్ పింఛనును తొలగించి జీతాలు చెల్లించనున్నారు. అంతేగాక, ట్రావెల్ అలెవెన్స్‌లు, అధికారిక టూర్ల వంటి ప్రయోజనాలు కల్పించనున్నారు. అయితే, ఇంక్రిమెంట్ల వంటి బెనిఫిట్స్ వీరికి ఉండవని సదరు కథనాలు పేర్కొన్నాయి. సిబ్బంది కొరతతో పాటు గత కొంతకాలంగా రైలు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఒక్క వాయువ్య రైల్వే జోన్‌లోనే 10వేలకు పైగా ఖాళీలు ఉన్నాయి. మిగతా జోన్లలోనూ పెద్ద ఎత్తున సిబ్బంది అవసరం ఉందని రైల్వే శాఖ వర్గాలు పేర్కొన్నాయి.

కోర్టుల్లో పరుష పదజాలం ఆక్షేపణీయం: సీజేఐ

పనాజీ: న్యాయస్థానాల్లో పరుష పదజాలానికి స్థానంలేదని సీజేఐ డీవై చంద్రచూడ్ స్పష్టంచేశారు. ముఖ్యంగా మహిళలను దుర్భాషలాడేందుకు వీలుండదని చెప్పారు. కొందరు సభ్యులు తమను దూషించినట్లు మహిళా న్యాయాధికారులు చేసిన ఫిర్యాదులపై సీజేఐ పై విధంగా స్పందించారు. కోర్టుల్లో మాట్లాడే భాష... మన విలువలు, గౌరవ మర్యాదలు, సాధికారతను ప్రతిబింబించేలా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా మహిళలు, అణగారిన వర్గాల వారిని కించపర్చే పరుష పదజాలానికి కోర్టుల్లో స్థానం ఉండదని సీజేఐ అన్నారు. లింగం, కులం, సామాజిక-ఆర్థిక స్థితిని బట్టి వ్యాఖ్యలు చేయడం ఆమోదయోగ్యం కాదని సూచించారు. కోర్టుల్లో లింగ మూసలు (జెండర్ స్టీరియోటైప్స్) గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు సుప్రీంకోర్టు ఒక హ్యాండ్‌బుక్‌ను రూపొందించిందని చెప్పారు. సీజేఐ చంద్రచూడ్ శనివారం ఉత్తర గోవా జిల్లా కోర్టుల కాంపెక్స్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతూ న్యాయం లభించేందుకు వచ్చే ఆటంకాలన్నింటిని తొలగించాలని అన్నారు. న్యాయం అందరికీ అందించేందుకు, ప్రాంతీయ భాషల్లోకి కోర్టు తీర్పుల అనువాదానికి కసరత్తు జరుగుతోందని తెలిపారు. కొంకణీ బాషలోకి సుప్రీంకోర్టు తీర్పుల అనువాదంపై హర్షం వ్యక్తంచేశారు. న్యాయ దేవత (లేడీ ఆఫ్ జస్టిస్) కొత్త రూపాన్ని ప్రశంసించారు. చట్టం గుడ్డిది కాదని, అందరినీ సమానంగా చూస్తుందన్నారు. న్యాయదేవత చేతిలో ఖడ్గం ఉండదు, సమ న్యాయాన్ని ఉద్బోదించే రాజ్యాంగం ఉంటుందని సీజేఐ చంద్రచూడ్ తెలిపారు.

మాది అందరి ప్రభుత్వం: సీఎం ఒమర్

జమ్మూ : అసెంబ్లీ ఎన్నికల్లో చూసిన ఓటింగ్ సరళిలో తమ ప్రభుత్వం నడపబోదని, కేంద్ర పాలిత ప్రాంతంలోని రెండు డివిజన్‌లలోని ప్రజల ముఖాల్లో 'తప్పిపోయిన చిరునవ్వు' తిరిగి చూడాలని కోరుకుంటున్నట్లు జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా శనివారం తెలిపారు. బుధవారం శ్రీనగర్‌లో సీఎంగా బాధ్యతలు స్వీకరించిన అబ్దుల్లాకు శీతాకాల రాజధానిలోని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) ప్రధాన కార్యాలయానికి చేరుకున్న సందర్భంగా ఘన స్వాగతం లభించింది. శనివారం ఇక్కడ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... రెండు ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పించేందుకు ఉప ముఖ్యమంత్రిని నియమించాలనే ఒత్తిడి ఎన్‌సీపై లేదని ఆయన స్పష్టం చేశారు.

దోపిడీ రహిత సమాజమే ధ్యేయం

- కేంద్ర విధానాలను తిప్పికొట్టాలి
- నవంబరు 26న దేశవ్యాప్త ప్రచారోద్యమం
- జయప్రదానికి అమర్‌జిత్ కౌర్ పిలుపు

వడోదర (గుజరాత్): దోపిడీ రహిత సమాజమే ధ్యేయంగా తమ పోరాటాలు కొనసాగుతాయని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ ఉద్ఘాటించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ నవంబరు 26న దేశవ్యాప్త ఆందోళన చేపడుతున్నామని, వీటిని జయప్రదం చేయాలని అన్ని వర్గాలకు పిలుపునిచ్చారు. సమ సమాజ స్థాపన, సమ న్యాయం సాధనకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. సముచిత వేతనాలు, ఒప్పంద పద్ధతికి అంతం, పని ప్రదేశాల్లో భద్రత కల్పన, అందరికీ సామాజిక భద్రత, పింఛన్ వంటివాటి కోసం పోరాటాలు ఆగబోవన్నారు. ప్రజలకు, రైతులకు, కార్మికులకు, దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా అమలవుతున్న విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అమర్‌జిత్ కౌర్ శనివారం గుజరాత్, వడోదరలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా సంయుక్త అధ్వర్యంలో నవంబరు 26న దేశవ్యాప్తంగా ప్రచారోద్యమాన్ని చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. కార్మిక సంఘాల చట్టాలు, కార్మిక హక్కుల కోసం 150 ఏళ్లు పాటు పద్దారని గుర్తుచేశారు. పోరాడి సాధించిన చట్టాలు, హక్కులను కాలరాసేందుకు కార్మిక వ్యతిరేక-కార్పొరేట్ అనుకూల విధానాలను కేంద్ర ప్రభుత్వం తెస్తోందని... 44 కేంద్ర చట్టాలను 4 కార్మిక కోడ్‌లుగా మార్చడాన్ని దుయ్యబట్టారు. కార్మికులకు సామాజిక భద్రత లేకుండా చేస్తోందని, ఈపీఎఫ్ఓ, ఈఎస్ఐసీ వంటి పథకాల ప్రైవేటీకరణకు పావులు కదుపుతోందని వ్యాఖ్యానించారు. క్లెయిమ్ కోసం ఇచ్చిన హామీ ప్రకారం బడ్జెట్ కేటాయింపులు ఉండటం లేదన్నారు. పెట్టుబడుల ఉపసంహరణ/ప్రైవేటీకరణ, అవుట్‌సోర్సింగ్, ఒప్పందీకరణ ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయాలని, ప్రైవేటుకు ఎర్ర తివాచీ పరుస్తున్న విధానాలను ఆమె ఖండించారు. దేశ సార్వభౌమత్వాన్ని, స్వీయసమృద్ధికి విఘాతం కలిగించేలా ప్రభుత్వ వైఖరి ఉందని, అంతర్జాతీయ ఫైనాన్స్ కేపిటల్‌తో దేశ ఆర్థిక వ్యవస్థను ముడిపెట్టే కసరత్తు జరుగుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలతో నిరుద్యోగం తారస్థాయికి చేరుకుందని, యువత భవిష్యత్ అంధకారమైందన్నారు. విద్య-ఆరోగ్య రంగాల ప్రైవేటీకరణకు పనులు వేగం పుంజుకున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల్లో కోతలు, పరోక్ష పన్నుల్లో పెంపుదలతో సామాన్యులపై మోయలేని భారం పడుతోందని, దిగిరాని నిత్యావసర ధరలతో పేదల బతుకులు దుర్భరమయ్యాయని అమర్‌జిత్ కౌర్ ఆందోళన వ్యక్తంచేశారు. సులభతర వాణిజ్యం నెపంతో కార్పొరేట్లకు పన్నుల్లో మినహాయింపులు ఇస్తుండటం వల్ల అసమానతలు పెరిగిపోతున్నాయన్నారు. ఒక్క శాతం జనాభా వద్దే దేశ సంపదలో 40.5శాతం ఉందని, మిగిలిన వారి వద్ద మిగిలింది మూడు శాతమే అని చెప్పారు. ఉద్యోగాలు లేక యువత ఆత్మహత్యలను శరణ్యంగా భావిస్తున్నారని, గతేడాది దేశంలో నమోదైన 25శాతం ఆత్మహత్యలు దినసరి కార్మికులవన్నారు. ఆకలి సూచీలో భారత్ స్థానం అధమమని, పౌష్టికాహార లోపం వల్ల ఐదేళ్లలోపు పిల్లల్లో 65శాతం మంది చనిపోతున్నట్లు సుప్రీంకోర్టుకు ఇచ్చిన అఫిడవిట్‌లో కేంద్రం ఒప్పుకున్నట్లు గుర్తుచేశారు. ఈ సమస్యలన్నింటినీ వదిలేసి సమాజంలోని వివిధ రంగాల ఉద్యమాలు, ప్రజాందోళనల అణచివేత లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని... విపక్షాల గళాన్ని నొక్కేందుకు ఈడీ, సీబీఐ, ఉపా, ఎన్ఎస్ఏ, ఎన్ఐఏ, దేశద్రోహ చట్టం వంటివి దుర్వినియోగిస్తోందని విమర్శించారు. గత పదేళ్లలో మహిళలపై నేరాలు, ఘోరాలు అమాంతం పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆడబిడ్డలకు న్యాయం నిరాకరించబడిందని, పనిప్రదేశాల్లో భద్రత కరువైందని తెలిపారు. మతం పేరుతో సామాజాన్ని విభజనకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, పాలకులు, ప్రజా ప్రతినిధులు పోటాపోటీగా విద్వేషాన్ని నూరుపోస్తున్నారని, ప్రజలను రెచ్చగొడుతున్నారని అమర్‌జిత్ కౌర్ దుయ్యబట్టారు. శాంతి-సామరస్యానికి విఘాతం కలిగించడంలో ఏ మాత్రం తీసిపోవడంలేదని విమర్శించారు. ఎంతో గొప్పగా రూపుదిద్దుకున్న రాజ్యాంగాన్ని సైతం తుంగలో తొక్కేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నవంబరు 26న తలపెట్టే ప్రచారోద్యమాన్ని జయప్రదం చేయాలని అమర్‌జిత్ కౌర్ పిలుపునిచ్చారు.

ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలే కాదు ప్రజలు కూడా: వాంగ్‌చుక్

న్యూఢిల్లీ: కేవలం ఎన్నికలు జరుపుకుంటే ఏదేని దేశం ప్రజాస్వామ్యం అనిపించుకోదని, ప్రజల గళాన్ని వినప్పుడే ప్రజాస్వామ్యంగా వర్ధిల్లుతుందని పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ అన్నారు. పక్షం రోజులుగా దిల్లీలో దీక్ష చేస్తున్న ఆయన అధ్వర్యంలో లేహ్ నుంచి దిల్లీ వరకు పాదయాత్ర జరిగింది. ఈ క్రమంలో గతనెలలో వాంగ్‌చుక్, ఆయన మద్దతుదారులు అరెస్టుకు గురై తర్వాత విడుదలయ్యారు. ఆపై లధాక్ భవన్‌లో నిరవధిక దీక్ష మొదలు పెట్టారు. ప్రభుత్వంతో చర్చలకు డిమాండ్ చేస్తున్నారు కానీ సర్కార్ స్పందించలేదు. దీక్ష చేస్తున్న కారణంగా వాంగ్‌చుక్ కొంత నీరసించిపోయారు. ఓపిక చేసుకొని పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో 'లధాక్ భవన్ వద్ద ఆంక్షలు ఉండటం మీకు తెలుసు. ఎవరు రావాలి, ఎవరు రాకూడదన్నది నియంత్రిస్తున్నారు. దీక్ష చేసేవారిని చూసి భయపడుతున్నారు' అని కేంద్రప్రభుత్వ వైఖరిని ఉద్దేశించి అన్నారు. 'దేశ రాజధానికి 150 మంది (80ఏళ్లు పైబడిన వారు, మహిళలు, రిటైర్డ్ సైనికులు) వస్తే వారిని తొలుత నిర్బంధించారు. ఆపై దీక్ష చేసే స్థితికి తెచ్చారు. ప్రజాస్వామ్యంలో ఇలా జరగడం బాధాకరం. ఇంత జరిగినా ప్రజల గొంతు వినే ఉద్దేశం సర్కార్‌కు లేదు. ప్రజలను, ప్రజల గొంతుకను గౌరవించకపోవడం దురదృష్టకరం. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యంలో ఈ దుర్గతి ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ఇంత కరువుగా ఉండరాదు. ఏళ్ల తరబడి సరిహద్దులను కాపాడాం. 5-6 యుద్ధాల్లో పాల్గొన్నాం. ప్రభుత్వ వైఖరి ప్రజల మనోధైర్యాన్ని, దేశభక్తిని దెబ్బతీస్తుంది' అని వాంగ్‌చుక్ ఆవేదన వ్యక్తంచేశారు. 'ప్రజాస్వామ్యంలో ప్రజలకు భయం ఉండరాదు. తల దించుకొని బతకనక్కర్లేదు.' అని చెప్పారు. ఇప్పటివరకు తమ వద్దకు ఎవరు రాలేదని, ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. ఇప్పటికప్పుడు నిర్ణయం తీసుకోమనడం లేదని, చర్చలు పునరుద్ధరించమని కోరుతున్నామని తెలిపారు. లధాక్‌లో దీక్ష చేసే వారిపై ఆంక్షలు ఉండవని, దేశ రాజధానిలో ఈ పరిస్థితి దురదృష్టకరమని అన్నారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం ఇప్పటికైనా స్పందిస్తుందని వాంగ్‌చుక్ ఆకాంక్షించారు.

చత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల దాడి

ఐఈడీ పేలి ఇద్దరు జవాన్ల మృతి

రాయ్‌పూర్: చత్తీస్‌గడ్‌లో మావోయిస్టులు మరోమారు పంజా విసిరారు. అత్యాధునిక పేలుడు పరికరం (ఐఈడీ) పేల్చారు. ఈ ఘటనలో ఇండో-టిబెటన్ సరిహద్దు పోలీస్ (ఐటీబీపీ) జవాన్లు ఇద్దరు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. దూర్‌బేడాలో ఆపరేషన్ ముగించుకొని శనివారం మధ్యాహ్నం నారాయణ్‌పూర్‌కు తిరిగి వెళుతుండగా కొడ్లియర్ గ్రామం సమీపంలో అబుజ్మాంద్ ప్రాంతంలో ఐఈడీ పేలింది. ఆపరేషన్‌లో సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్), డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్‌తో పాటు ఐటీబీపీ పాల్గొన్నది. అమర జవాన్లను అమర్ పన్వర్ (సతారా-మహారాష్ట్ర), కె.రాజేశ్ (కడప-ఆంధ్రప్రదేశ్)గా గుర్తించారు. ఐటీబీపీ 53వ బెటాలియన్ సభ్యులైన వీరిద్దరి వయస్సు 36ఏళ్లు. గాయపడిన ఇద్దరు నారాయణ్‌పూర్ జిల్లా పోలీసులని, వారిద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు.

'ఏసీసీ' కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-తాడేపల్లి: ఏసీసీ సిమెంట్ కార్మికుల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. శనివారం సాయంత్రం తాడేపల్లి బ్రహ్మానందపురంలోని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ 1993వ సంవత్సరం ఏసీసీ యాజమాన్యం సిమెంట్ ఫ్యాక్టరీని అక్రమ లాకౌట్ చేసిందన్నారు. గత 40 ఏళ్లుగా సిమెంట్ కార్మికులకు నష్టపరిహారం చెల్లించాలని కార్మికులు అనేక ఆందోళనలు, నిరసనలు చేసినప్పటికీ, సమస్యలను విన్నవించినప్పటికీ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం కానీ, ప్రభుత్వ అధికారులు కానీ ఇప్పటివరకు కార్మికులకు నష్టపరిహారం చెల్లించకపోవడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు నష్టపరిహారాన్ని చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా సిమెంట్ ఫ్యాక్టరీ భూములు అన్యాక్రాంతం కాకుండా హైకోర్టు ఆదేశానుసారం ఫ్యాక్టరీ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్నాయే గానీ 30 సంవత్సరాల నుంచి సుదీర్ఘ పోరాటం చేస్తున్న ఫ్యాక్టరీ కార్మికుల సమస్య పరిష్కారం కాకపోవటం విచారకరమని అన్నారు. దాదాపు రూ.1400 కోట్ల విలువ గల 137 ఎకరాల భూమి ఇక్కడ ఉందన్నారు. కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారని వారికి సహాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంద న్నారు. మంత్రి నారా లోకేష్‌ని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను వివరిస్తామని, అందరికీ న్యాయం జరిగేంతవరకు ఒత్తిడి తీసుకొస్తామని, వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, సీపీఎం నాయకులు బూరగ వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల యూనియన్ నాయకులు స్టీవెన్, ఏఐఎఫ్‌టీయూ న్యూ నాయకులు కె.ఆదినారాయణ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఎంవీవీ ఇంట్లో ఈడీ సోదాలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: వైసీపీ నేత, మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఇంట్లో, కార్యాలయాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోదాలు చేపట్టారు. విశాఖలోని లాసన్స్ బే కాలనీలోని సత్యనారాయణ ఇంట్లో, మధురవాడలోని సిటీ కార్యాలయంలోనూ శనివారం ఉదయం సోదాలు నిర్వహించారు. ఆడిటర్ వెంకటేశ్వరరావు, గద్దె బ్రహ్మాజీ నివాసాలు, కార్యాలయాల్లోనూ తనిఖీలు జరిగాయి. ఏకకాలంలో ఐదు చోట్ల ఈడీ దాడి చేసింది. విశాఖపట్నం పరిధిలో నమోదు చేసిన కేసులు ఆధారంగా ఈ సోదాలు జరిగాయి. ఎంవీవీ సత్యనారాయణపై మోసం, కుట్ర, ఫోర్జరీ వంటి ఆరోపణలతో కేసు నమోదైంది. దీనిపై ఆయన హైకోర్టు నుంచి ముందస్తు బెయిల్ తెచ్చుకున్నారు. ఆర్థిక లావాదేవీలతో పాటు భూముల కొనుగోళ్లు సంబంధించి ఈడీ వద్ద ప్రాథమిక సమాచారం ఉంది. ఆదాయం, ఆర్థిక వనరులు, తనిఖీల్లో లభించిన పత్రాల తాలుకు సమాచారాన్ని బేరీజు వేసుకుంటూ తనిఖీలు నిర్వహించారు. ఆరు నెలలుగా ఎంవీవీపై సేకరించిన సమాచారంతో సోదాలు చేపట్టారు. రూ.12.5 కోట్ల లావాదేవీల వ్యవహారంలో ఈడీ ఇటీవల కేసు నమోదు చేసింది. హైగ్రీవా ఇన్ఫ్రాటెక్ ఓనర్ రాధారాణి, కంపెనీ ఎండీ జగదీశ్వరుడు ఇళ్లల్లోనూ అధికారులు తనిఖీలు చేశారు. 2006-08లో జరిగిన లావాదేవీలపై ఈడీ కేసు నమోదు అయింది. తనిఖీల సమయంలో సత్యనారాయణ ఇంట్లో లేరని తెలిసింది. కాగా, గీతాంజలి, అభినేత్రి, నీవెవరు వంటి తెలుగు సినిమాలను ఆయన నిర్మించారు.

ఫామ్ వర్సిటీలకు పూర్తిస్థాయి వైస్ ఛాన్సలర్లను నియమించాలి: కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఇంఛార్జి పాలనలో కొనసాగుతున్న వర్సిటీలకు పూర్తి స్థాయి వైస్ ఛాన్సలర్‌లను నియమించాలని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు అచ్చెన్నాయుడు, నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ (తిరుపతి), ఆచార్య యన్.జి.రంగా వ్యవసాయ యూనివర్సిటీ (లాం, గుంటూరు), డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ (వెంకటరామన్నగూడెం), ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ (నర్సాపురం ప్రస్తుతం విజయవాడ) లకు గత కొంత కాలంగా పూర్తిస్థాయి వైస్ ఛాన్స్‌లర్లు లేరని, ఇంఛార్జిల పాలన కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ విశ్వవిద్యాలయాల ద్వారా రైతులకు ఉపయోగపడే వ్యవసాయ పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాలు, వ్యవసాయ విజ్ఞాన విద్యను విద్యార్థులకు బోధించడం తదితర కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. 2023 ఆగస్టు నుంచి ఆచార్య యన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీలకు, 2024 ఆగస్టు నుంచి డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీకి పూర్తిస్థాయి వైస్ ఛాన్స్‌లర్లు లేరని తెలిపారు. ఏపీ ఫిషరీస్ యూనివర్సిటీ ప్రారంభం నుంచే ఇంఛార్జి పాలనలో కొనసాగుతున్నదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ, డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీలకు సీనియర్ ప్రొఫెసర్లను ఇంఛార్జి వైస్ ఛాన్సలర్లుగా నియమించారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని వ్యవసాయ, అనుబంధ యూనివర్సిటీలకు పూర్తిస్థాయి వైస్ ఛాన్సలర్లను సెర్చ్ కమిటీ పర్యవేక్షణలో నియమించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కృష్ణా నదికి జలకళ

- శ్రీశైలం డ్యామ్ 4 గేట్లు ఎత్తి నీటి విడుదల
- నిండుకుండలా నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులు



విజయవాడ: కృష్ణా నదికి జలకళ సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో పరవళ్లు తొక్కుతోంది. నీటి ప్రవాహం పెరగడంతో అధికారులు శ్రీశైలం ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తివేశారు. 1.11 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు 1.90 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 884.90 అడుగులకు చేరింది. అటు నాగార్జున సాగర్ నిండుకుండలా మారింది. వరద పెరగడంతో నాగార్జునసాగర్ నీటిమట్టం 590 అడుగులకు చేరుకుంది. దీంతో 12 గేట్లను ఐదడుగుల మేర ఎత్తి 97 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. 1,38,338 క్యూసెక్కులు ఇన్‌ఫ్లోతో అంతే మొత్తంలో సాగర్ కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేస్తున్నారు. నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా ప్రస్తుతం పూర్తి స్థాయికి చేరుకుంది. అదే విధంగా పులిచింతలకు ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో ఐదు గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. 1.18లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో... ఔట్‌ఫ్లో 1.36 లక్షల క్యూసెక్కులుగా ఉంది.

వాటర్ బాటిళ్లు, సైకిళ్లపై జీఎస్టీ తగ్గింపు

ఖరీదైన షూస్, వాచీలపై వడ్డింపు

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) రేట్ల హేతుబద్ధీకరణపై ఏర్పాటయిన మంత్రివర్గ ఉప సంఘం కొన్ని వస్తువులపై జీఎస్టీ తగ్గించాలని నిర్ణయించింది. 20 లీటర్ల ప్యాకేజ్డ్ వాటర్ బాటిల్, సైకిళ్లు, ఎక్సర్‌సైజ్ నోట్‌బుక్స్ వంటి వస్తువులు ఈ జాబితాలో ఉన్నాయి. అదే సమయంలో ఖరీదైన షూస్, చేతి వాచీలపై పన్ను పెంచాలని ప్రతిపాదించనుంది. బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ ఉప సంఘం భేటీలో దీనిపై చర్చ జరిగింది. దీనివల్ల రూ.22 వేల కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూర నుంది. ప్రస్తుతం 20 లీటర్ల ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ బాటిల్‌పై 18 శాతం జీఎస్టీని వసూలు చేస్తున్నారు. దీన్ని 5 శాతానికి తగ్గించాలని మంత్రివర్గ ఉప సంఘం నిర్ణయించింది. అలాగే రూ.10 వేల్లోపు ధర కలిగిన సైకిళ్లపై 12 శాతం 5 శాతానికి తగ్గించేందుకు ఈ సమావేశంలో నిర్ణయించారు. నోట్ పుస్తకాలపైనా జీఎస్టీని 12 నుంచి ఐదు శాతానికి తగ్గించాలని మంత్రివర్గ ఉప సంఘం ప్రతిపాదించింది. ఈ నిర్ణయాలను జీఎస్టీ కౌన్సిల్ ఆమోదిస్తే ఆ మేర ఊరట కలగనుంది. అలాగే, రూ.15 వేలు కంటే అధిక విలువ కలిగిన షూస్, రూ.25 వేల కంటే ఎక్కువ ధర ఉన్న చేతి వాచ్‌లపై జీఎస్టీని 18 నుంచి 28 శాతానికి పెంచాలని ఉప సంఘం ప్రతిపాదించింది. మొత్తం ఈ భేటీలో 100 వస్తువులకు సంబంధించి జీఎస్టీ రేట్లను చర్చించారు. 12 శాతం పన్ను పరిధిలో ఉన్న చాలా వస్తువులపై జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని ప్రతిపాదించారు. దీంతో పాటు 18 శాతం శ్లాబులో ఉన్న హెయిర్ డ్రైయర్లు, హెయిర్ కర్లర్లు, బ్యూటీ, మేకప్ సామగ్రిపై ఉన్న జీఎస్టీని మళ్లీ 28 శాతం శ్లాబులోకి చేర్చాలని మంత్రివర్గ ఉప సంఘం ప్రతిపాదించింది. ప్రస్తుతం జీఎస్టీలో 5, 12, 18, 28 శాతం చొప్పున నాలుగు పన్ను శ్లాబులు ఉన్నాయి. అవసరమైన వస్తువులను తక్కువ శ్లాబులో, లగ్జరీ వస్తువులను ఎక్కువ శ్లాబులో ఉన్నాయి. కొన్ని వస్తువులకు 28 శాతం జీఎస్టీతో పాటు అదనంగా సెస్సు కూడా విధిస్తున్నారు. వివిధ రకాల వస్తువులపై విధిస్తున్న సగటు జీఎస్టీ రేటు 15.3 శాతం దిగువకు చేరడంతో జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరించాలని నిర్ణయించారు.

66 మందితో బీజేపీ తొలి జాబితా

రాంచీ: జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోయే తమ అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ ప్రకటించింది. 66 మంది పేర్లను శనివారం విడుదల చేసింది. రాష్ట్రంలో మొత్తం 81 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. బీజేపీ తొలి జాబితాలో చోటుచేసుకున్న ప్రముఖుల్లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి బాబూలాల్ మరాండీ, జేఎంఎం నుంచి కమలం గూటిలోకి చేరిన మాజీ ముఖ్యమంత్రి చంపై సోరెన్, సీతా సోరెన్ తదితరులు ఉన్నారు. ధన్‌వార్ నియోజకవర్గం నుంచి బాబూలాల్ మరాండీ పోటీ చేయనుండగా, సరైకేలా నుంచి చంపై సోరెన్, జమ్తారా నుంచి సీతా సోరెన్ పోటీ చేస్తున్నారు. కోడెర్మా నుంచి నారా యాదవ్, గాండే నుంచి మునియా దేవి, సింద్రి నుంచి తారాదేవి, నిర్సా నుంచి అపర్ణా సేన్‌గుప్తా, ఝరియా నుంచి రాగిణి సింగ్, ఛాతర్‌పూర్ నుంచి దేవి భూయాన్ తదితరులు పోటీ చేస్తున్నారు.

న్యూజిలాండ్ లక్ష్యం 107

- టీమిండియా 462 ఆలౌట్
- సెంచరీతో సత్తా చాటిన సర్ఫరాజ్

బెంగళూరు: భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య ఇక్కడి చిన్నస్వామి స్టేడియంలో జరుగుతున్న తొలి టెస్టు రసకందాయంలో పడింది. తొలి ఇన్నింగ్స్‌లో 46పరుగులకే కుప్పకూలిన టీమిండియా...రెండో ఇన్నింగ్స్‌లో సత్తా చాటింది. 462 పరుగులకు ఆలౌటైంది. ఈ క్రమంలోనే కివీస్‌కు 107 పరుగుల లక్ష్యం నిర్దేశించింది. అనంతరం న్యూజిలాండ్ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగింది. తొలి ఓవర్‌లో నాలుగు బంతులు పడిన తర్వాత ఒక్కసారిగా మబ్బులు కమ్మేసి భారీ వర్షం కురవడం మొదలైంది. దీంతో ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌ల్లోకి చేరగా... మైదాన సిబ్బంది గ్రౌండ్‌ని కవర్లతో కప్పి ఉంచారు. కాసేపటికే నాలుగో రోజు ఆటను ముగిస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. రెండో ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ పరుగులేమీ చేయలేదు. రెండవ ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లలో సర్ఫరాజ్ ఖాన్ (150; 195 బంతుల్లో 18 ఫోర్లు, 3 సిక్స్‌లు) భారీ శతకం సాధించగా... రిషబ్ పంత్ (99; 105 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్స్‌లు) త్రుటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. విరాట్ కోహ్లీ (70), రోహిత్ (52), జైశ్వాల్ (32) పరుగులు చేశారు. కేఎల్ రాహుల్ (12), రవీంద్ర జడేజా (5), అశ్విన్ (15) నిరాశపర్చారు. ఒకదశలో 400/3తో బలమైన స్థితిలో నిలిచిన టీమ్‌ఇండియా... కివీస్ బౌలర్లు కొత్త బంతిని అందుకున్న తర్వాత వేగంగా వికెట్లు కోల్పోయింది. కొత్త బంతితో భారత్ 62 పరుగులు మాత్రమే చేసి ఏడు వికెట్లు కోల్పోయింది. న్యూజిలాండ్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ 3, విలియం 3, అజాజ్ పటేల్ 2, టిమ్ సౌథీ, గ్లెన్ ఫిలిప్స్ తలో వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా 46 పరుగులకు ఆలౌట్ కాగా.. కివీస్ 402 పరుగులు చేసింది. ఆదివారం ఆటకు చివరి రోజు.

విద్యార్థులకు 'విదేశీ' జబ్బు: ధన్కర్

జైపూర్: విదేశాలకు వెళ్లడమన్న జబ్బు దేశ పిల్లలను పీడిస్తోందని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ వ్యాఖ్యానించారు. ఇది కొత్త జబ్బు. దీనిని ఫోరెక్స్ డ్రెయిన్, బ్రెయిన్ డ్రెయిన్ అంటారు అని ఆయన వ్యాఖ్యానించారు. విద్యను వ్యాపారం చేయడం వల్ల నాణ్యతపై ప్రతికూల ప్రభావం చూపుతుందని, ఇది దేశ భవిష్యత్‌కు మంచిది కాదన్నారు. ధన్కర్ శనివారం రాజస్థాన్, సికార్‌లోని ఓ ప్రైవేటు విద్యాసంస్థలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. 'పిల్లలు విదేశాలకు వెళ్లేందుకు ఉవ్విళ్లూరుతున్నారు తప్ప ఏ సంస్థకు వెళుతున్నాం, ఏ దేశానికి వెళుతున్నాం అనేది పట్టించుకోవడంలేదు. 2024లో 13 లక్షల మంది విద్యార్థులు విదేశాలకు వెళ్లారు' అని ధన్కర్ చెప్పారు. విద్యార్థుల వలసల వల్ల ఆరు బిలియన్ డాలర్ల విదేశీ మారకానికి గండిపడిందన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.